
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 17 జూలై 2025 | 5


ఎండ పాట్లు

బాబోయ్.. ఇవేం ఎండలు!

- ఉక్కపోత, వేడి వాతావరణం
- వేడిగాలులతో ఉక్కిరిబిక్కిరి
- వర్షాకాలంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యం
- కొందరికి అనారోగ్య పరిస్థితులు


కాకినాడ నగరంలో ఎండ తీవ్రత కారణంగా గొడుగు వేసుకుని వెళుతున్న యువతులు

ఇది వర్షాకాలమా! మండు వేసవిలో ఉన్నామా! ప్రస్తుత వాతావరణం పరిస్థితి చూస్తే అందరికీ అదే అనుమానం కలుగుతోంది. వర్షాలు కురవాల్సిన సమయంలో వేసవిని తలపించే రీతిలో కాస్తున్న ఎండలు, వీస్తున్న వేడిగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

పిఠాపురం/ రాజమహేంద్రవరం సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడి అందరూ సేదతీరారు. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత అప్పుడప్పుడు పడిన వర్షాలు, రుతు పవనాల ప్రభావం అంతంతమాత్రంగానే ఉండి ఎండలు తీవ్రంగా కాస్తుండడంతో ఇప్పుడు వేసవికాలం అన్నట్టుగా మారిపోయింది వాతావరణం. గత నాలుగైదు రోజులుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా గరిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటలకే వేడిగాలులు ప్రారంభమై, సాయంత్రం వరకు కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు రోడ్లపైకి వచ్చేందుకు సాహసించట్లేదు. మధ్యాహ్నం పూట రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. బైక్‌లపై కూడా బయట తిరగలేని పరిస్థితి. టోపీలు పెట్టుకున్నా, కూలింగ్ గ్లాస్‌లు ధరించినా మాస్క్‌లు పెట్టుకున్నా సరే ఎండదెబ్బకు హడలిపోయారు. ఉపశమనం కోసం శీతలపానీయాలు వైపు పరుగులు పెడుతున్నారు. ఈ వాతావరణంతో మరోపక్క తలపోటు, జ్వరాలు వచ్చి జనం ఇబ్బందులు పడుతున్నారు. అటు సాయంత్రం నుంచి రాత్రి వరకు ఒకటే ఉక్కపోత. ఆపై వేడి తగ్గకపోవడంతో వృద్ధులు, చిన్నారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. పిఠాపురం, కాకినాడ, తుని, పెద్దాపురం, సామర్లకోట, గొల్లప్రోలు, ఏలేశ్వరం, జగ్గంపేట తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 37-39 డిగ్రీల మధ్య ఉంటున్నాయి. అమలాపురం, రాజమహేంద్రవరంలలో కూడా ఇదే పరిస్థితి. అయితే 41-43 డిగ్రీలు ఉన్న ఫీలింగ్ ఉంటుందని వాతావరణశాఖ చెప్తోంది. రుతుపవనాల ప్రభావం అంతగా లేకపోవడం, బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో వేడిగాలులు వీస్తున్నట్టు చెప్తున్నారు. బుధవారం ఇదే పరిస్థితి ఉండగా, గురువారం నుంచి అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ చెప్పడం ఒక్కటే కొంత ఉపశమనంగా ఉంది.

'నీరి' తేరేనా..


గోదావరి కాల్వలోకి చెత్త డంపింగ్ (ఫైల్)

- ఉమ్మడి జిల్లాలో గోదావరి పంట కాలువల కాలుష్యంపై ప్రభుత్వం దృష్టి
- కాలువల నిండా తీవ్రంగా వ్యర్థాలు పెరగడంతో అన్నదాతల ఇబ్బందులు
- వందలాది గ్రామాల్లోని ప్రజల తాగునీటి అవసరాలకు ఈ నీళ్లే దిక్కు
- సమస్య మూలాలపై అధ్యయన బాధ్యతలు కేంద్ర ప్రభుత్వం సంస్థకు అప్పగింత
- గోదావరి కాలువల్లో ఇనిస్టిట్యూట్ నిపుణుల అధ్యయనం : 4 నెలల్లో నివేదిక
- అటు కాలువల్లో కోళ్లు, రొయ్యలు తదితర వ్యర్థాలన్నీ యథేచ్ఛగా పారబోత
- అనేక పరిశ్రమల వృథా కాలుష్య జలాలూ కాలువల్లోకే మళ్లింపు
- 'మిషన్ క్లీన్ గోదావరి' అంటూ వైసీపీ ప్రభుత్వం హడావుడి.. పనులు నిల్

ఉమ్మడి జిల్లాలో కాలుష్య కాసారాలుగా మారిపోయిన గోదావరి కాలువలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ఎక్కడికక్కడ కోళ్లు, రొయ్యలతోపాటు నివాస, వాణిజ్య, పారిశ్రామిక వ్యర్థాలన్నీ యథేచ్ఛగా కాలువల్లో కలిసిపోవడంతో అన్నదాతలు పడతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఈనేపథ్యంలో సమస్య పరిష్కరించడానికి రంగంలోకి దిగింది. కాలువలు ఎక్కడెక్కడ ఏవిధంగా కాలుష్యం అవుతున్నాయో గుర్తించాలని నిర్ణయించింది. ఈమేరకు సమగ్రంగా అధ్యయనం చేయించేందుకు సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (నీరి)కి బాధ్యతలు అప్పగించింది. త్వరలో ఈ సంస్థ నిపుణులు గోదావరి కాలువలపై అధ్యయనం చేయనున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి ప్రధాన కాలువలు తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో 2,400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. మధ్య డెల్టా కింద కోనసీమ, తూర్పు డెల్టా కింద ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు కాలువలు, డ్రైన్ల ద్వారా గోదావరి నీరు ప్రవహిస్తోంది. ఈ నీళ్లు లక్షల ఎకరాల పంటసాగుతోపాటు తాగునీటికి కూడా ఆధారం. ఈ నేపథ్యంలో వీటిని ఎక్కడికక్కడ సురక్షితంగా ఉంచితేనే ఆ నీళ్లు తాగే ప్రజల ఆరోగ్యానికి ధీమా. కానీ దీనికి విరుద్ధంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గోదావరి కాలువలు కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. అనేకమంది ఇళ్లల్లో ఉండే చెత్తాచెదారం అంతా తెచ్చి ఈ కాలువల్లోనే పారబోస్తున్నారు.


అనపర్తిలో గోదావరి కాల్వ వెంబడి చెత్త

గృహనిర్మాణ వ్యర్థాలు, చికెన్, చేపలు, రొయ్యల వ్యర్థాలు, మద్యం దుకాణాల మొదలు క్షవరశాలలు, వందలాది వాణిజ్య దుకాణాల్లో వాడిపడేసిన వస్తువులను కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఇది కాకుండా కడియం నుంచి కాకినాడ వరకు, ఆత్రేయపురం నుంచి అమలాపురం వరకు కాలువలకు సమీపంలో వందలాది కోళ్లఫారాలున్నాయి. వీటిల్లోని వందల టన్నుల వ్యర్థాలను డ్రమ్ముల్లో తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా అనపర్తి, కడియం, బిక్కవోలు, ద్వారపూడి, సామర్లకోట, కాకినాడ, కోనసీమ పరిధిలోని కాలువల్లో ఈ తరహా వ్యర్థాలు భయంకరంగా కలిపేస్తున్నారు. కోనసీమ పరిధిలో రొయ్యల చెరువుల్లో వాడిన నీటిని పైపులతో గోదావరి కాలువలకు మళ్లిస్తున్నారు. అటు తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని నిడదవోలు, కొవ్వూరు తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. ఇందులో అనేకరకాల హానికారక రసాయనాలు కలిసి ఉంటాయని తెలిసినా లెక్కచేయడం లేదు. ఇలా ఎక్కడికక్కడ కాలువలు విషమయం అవుతుండగా, ఆ నీటిని తాగే మూగజీవాలు తరచూ మృత్యువాత పడుతున్నాయి. అలాగే పంచాయతీల పరిధిలోని మురుగుకాలువల నీటినీ కాలువల్లోకే తరలిస్తున్నారు. అలాగే రాజమహేంద్రవరం నుంచి సామర్లకోట వరకు కాలువలకు సమీపంలో అనేక రకాల పరిశ్రమలున్నాయి. వీటిలో వినియోగించగా వచ్చే కాలుష్య జలాలను శుద్ధిచేసి భూమిలోకి వెళ్లేలా చేయాలి. కానీ ఖర్చు సాకుతో గుట్టుగా పైపుల్లోంచి గోదావరి కాలువల్లోకి కలిపేస్తున్నారు. ఈనేపథ్యంలో గత వైసీపీ సర్కారు 'మిషన్ క్లీన్ గోదావరి' పేరుతో ప్రత్యేక ప్రాజెక్టును 2019 సెప్టెంబరులో ప్రారంభించింది. సీఎం చైర్మన్‌గా వ్యవహరించే ప్రాజెక్టు కింద రూ.100 కోట్లతో పనులు చేస్తామని గొప్పలు చెప్పింది. తీరా అయిదేళ్లలో కాలుష్య నివారణకు పైసా ఖర్చు చేయలేదు. ఈ నేపథ్యంలో తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో 175 చోట్ల గోదావరి కాలువల్లో నీళ్లు విషతుల్యంగా మారినట్టు నీటి పారుదలశాఖ రెండేళ్ల కిందట గుర్తించింది. కాలువల వెంబడి వ్యర్థాలపై డ్రోన్లతో పంచాయతీలు, మున్సిపాల్టీలు సర్వే చేసింది. అత్యధికంగా కోనసీమలో కోళ్లు, రొయ్యల వ్యర్థాలు, కడియం, ద్వారపూడి, అనపర్తి, బిక్కవోలు, సామర్లకోట పరిధిలో 68 చోట్ల కాలువలు నీళ్లు వ్యర్థాలతో విషపూరితంగా మారినట్టు నిర్ధారించారు. కొన్నిచోట్ల పరిశ్రమల నుంచి కాలుష్య జలాలు నేరుగా కలిసిపోతున్నట్టు తేల్చారు. ఇవన్నీ పంటపొలాలకు చేరడంతో పంటలు నష్టపోవడం, అటు భూగర్భ జలాలు సైతం కలుషితం అయినట్టు ఆయాశాఖలు తేల్చాయి. కానీ అప్పటి ప్రభుత్వం పైసా కూడా ఇవ్వకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టిసారిం చింది. కాలువల్లో ఎక్కడెక్కడ కాలుష్యం కలుస్తోంది? ఆయా జల కాలుష్యంతో ఎంతెంత హానికర రసాయనాలున్నాయి? తద్వారా వచ్చే సమస్యలేంటి? అనే దానిపై అధ్యయనం చేయించాలని నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు చైర్మన్ కొన్ని రోజుల కిందట జిల్లాలో కాలువలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం చర్చించగా, సమగ్రంగా అధ్యయనం చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(నీరి)కి అప్పగించాలని నిర్ణయించారు. త్వరలో నీరి అధ్యయనం చేసి పరిష్కారం సూచిస్తూ నాలుగు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందించనుంది.

బలభద్రపురంపైనా..

బిక్కవోలు మండలం బలభద్రపురంలో క్యాన్సర్ కేసులు కలకలం రేపిన విషయం తెలిసిందే. గ్రామంలో 62 క్యాన్సర్ కేసులున్నట్టు కాకినాడ రంగరాయ వైద్య కళాశాల అధ్యయనంలో తేలింది. ఒకే తరహా కాకుండా పలు రకాల క్యాన్సర్ కేసులు ఇక్కడే రావడానికి ఏయే కాలుష్య కారకాలు కారణం అనేది అధ్యయనం చేసి తేల్చే బాధ్యతను ప్రభుత్వం 'నీరి'కి అప్పగించింది. ఇందుకు రూ.50లక్షల వరకు ఖర్చవుతుండగా, పీసీబీ తరపున ఖర్చులు భరించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలో నిపుణులు అధ్యయనం ప్రారంభించనున్నారు. మరోవైపు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సైతం త్వరలో ఇక్కడ క్యాన్సర్ స్క్రీనింగ్ చేపట్టనుంది.

ప్రజా పంపిణీ వ్యవస్థలో అవకతవకలు జరిగితే సహించేదిలేదు

డీఎస్‌వో వి.పార్వతి


కరగపాడులో స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్‌వో పార్వతి

గోపాలపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందాల్సిన నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి వి.పార్వతి అన్నారు. మండలంలోని కరగపాడు గ్రామంలోని షాపు నెంబర్.33 చౌక దుకాణాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో స్టాకుకు సేల్స్‌కు భారీ వ్యత్యాసం కనపడడంతో ఆమె అవాక్కయ్యారు. గతంలో ఇదే షాపుపై రెండుసార్లు తనిఖీలు చేయగా 1500కిలోల బియ్యం తేడా రావడంతో 6ఏ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. వాటితో కలిపి 2,920 కిలోల బియ్యం స్టాకు రికార్డు ప్రకారం దుకాణంలో ఉండాల్సి ఉండగా, కేవలం 100 కిలోల బియ్యం ఉన్నాయన్నారు. గతంలో 6ఏ కేసుకు సంబంధించి 15క్వింటాళ్ల బియ్యం కాగా మరో 1320కిలోల బియ్యం దుకాణంలో లేవన్నారు. దీనిపై కేసు నమోదు చేసి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామంలో పలువురు వినియోగదారులను దుకాణ నిర్వహణపై ఆరా తీయగా, బియ్యం సక్రమంగా ఇవ్వడంలేదని తెలపడంతో ఆమె నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 33వ నెంబర్ షాపు ఇన్‌ఛార్జ్‌ను తొలగించి స్వయం సహాయ సంఘాల మహిళల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఆమె వెంట సివిల్ సప్లై డీటీ దివాకర్, ఆర్ఐ సునీత, వీఆర్వో బొదియ్య ఉన్నారు.

సామాజిక తనిఖీలో భారీగా అక్రమాలు గుర్తింపు


చాగల్లులో జరిగిన ఎన్‌ఆర్‌జీఎస్ ప్రజావేదిక సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

చాగల్లు,జూలై16(ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరం జరిగిన జాతీయ ఉపాధిహామీ పనులపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి మాట్లాడుతూ సామాజిక భద్రత పెన్షన్‌లు లబ్ధిదారుల ఇంటి వద్దనే ప్రతి నెల సకాలంలో అందజేయాలని సూచించారు. మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో రూ.7.5 కోట్లు వ్యయంతో 971 పనులు జరిగాయి. వీటిలో రూ.53.61 లక్షలు మేర తేడాలు జరిగినట్టు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. ఈ విషయమై డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రూ.1.17 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. రూ.25 లక్షల విలువ చేసే పనులు తిరిగి చేయాలని ఆదేశించారు. మరొక రూ.16 లక్షలు విలువ చేసే పనులపై ఏపీడీ ఆధ్వర్యంలో విచారణ చేయించాలన్నారు. ఎస్ఆర్‌పీ బి.సూర్యచంద్ర విలేకరులతో మాట్లాడుతూ పంట కాలువలు లేనివి ఉన్నట్టుగా చూపించడం, కొలతల్లో భారీగా తేడాలు గుర్తించడం జరిగిందన్నారు. వర్క్ బోర్డులు ఏర్పాటుచేయకపోవడం, ఉపాధిహామీలో నాటిన మొక్కలు నిర్వహణ సక్రమంగా లేకపోవడం వంటి అనేక అవకతవకలు గుర్తించినట్టు చెప్పారు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకునే ఆశలు అంగన్‌వాడీ సిబ్బంది పెన్షన్‌లు తీసుకున్నట్టు గుర్తించారు. ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో కనీస వసతులు కూడా ఏర్పాటులేదని ఫిర్యాదులు అందినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్సు అధికారిణి రత్నకుమారి, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, ఏపీడీ బి.రామ్‌ప్రసాద్, అంబుడ్స్‌పర్సన్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

న్యాయవాదుల బైక్ ర్యాలీ

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): జూలై 10 నుంచి 16 వరకూ మీడియేషన్ ఫర్ ద నేషన్ (మధ్య వర్తిత్వం-దేశం కోసం) వారోత్సవాలను నిర్వహించారు. చివరి రోజయిన బుధవారం బైక్ ర్యాలీని నిర్వహించారు. దీనిని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి ప్రారంభించారు. వారోత్సవాల్లో భాగంగా మధ్య వర్తిత్వంపై విస్తృతంగా అవగాహన కల్పించామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, శిక్షణ తీసుకున్న న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బాలస్వాస్థ్యలో విద్యార్థులు, అంగన్వాడీ పిల్లలకు వైద్యపరీక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పాఠశాలల విద్యార్థులు, అంగన్వాడీ పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం జిల్లాస్థాయిలోని మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు డీఐసీ పీడియాట్రీషియన్ డాక్టర్ ఇంద్రజ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వైద్య, ఆరోగ్యశాఖాధికారి మాట్లాడుతూ ఈ ఏడాది మరింత పటిష్టంగా ఈ స్క్రీనింగ్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నివారణా ర్యాలీ

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 30న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 15 రోజులపాటు ప్రత్యేక అవగాహనా, ప్రచార ర్యాలీలను నిర్వహిస్తున్నామని చైల్డ్‌రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం రైల్వే స్టేషనుల్లో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి అనంత ప్రదీప్, ఆర్పీఎఫ్ ఎస్ఐ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతం.. వదలాల్సిందే!



- నిషేధం పక్కాగా అమలు
- కలెక్టర్ స్వీయ పర్యవేక్షణ
- 900 మందితో నిత్యం తనిఖీలు
- పట్టుబడితే వెయ్యి జరిమానా
- గుడ్డ, నార సంచుల జాడ ఎక్కడ?


రోడ్డు పక్కన దుకాణాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి (ఫైల్)

ప్లాస్టిక్ వాడకం ఆరోగ్యానికి చేటు చేస్తుందంటే వినరు.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని వాడొద్దంటే వినరు.. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న పాలిథీన్ కవర్లను నిషేధించామన్నా వినబడదు.. ఇంటి నుంచి సంచి తీసుకెళ్లడానికి నామోషీ. అందుకే కలెక్టర్, మునిసిపల్ కార్పొరేషన్ ఇంచార్జి కమిషనర్ ప్రశాంతి కొరడా ఝుళిపిస్తున్నారు. స్వయంగా దుకాణాల్లో తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫలితాలు రావాల్సిందేనంటూ అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. నార, వస్త్రం, కాగితపు సంచులనే వినియోగించాలని ప్రచారం చేస్తున్నారు. ఈ చర్యలు ఫలితాలను ఇస్తే ప్లాస్టిక్ ఫ్రీ 'తూర్పు'ను చూడొచ్చు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మనిషి మనుగడపై మనిషే గొడ్డలి వేటు వేసుకోవడమే కాలుష్యం. ఇది ఇవాళ జీవరాశి మనుగడను ప్రమాదంలో పడేసింది. జల, వాయు, ఆహార.. ఇలా అనేక కాలుష్యాలకు ప్రధాన కారణం మనమే. వీటిలో ప్లాస్టిక్ ప్రళయంగా ముంచెత్తుతోంది. ఏదో రకంగా ప్రతి రోజూ ప్లాస్టిక్ తోనే పయనం సాగిస్తున్నాం. ముఖ్యంగా ప్లాస్టిక్ (పాలిథీన్) సంచులను విచ్చలవిడిగా వాడుతున్నారు. అన్ని మైక్రాన్లు, ఇన్ని మైక్రాన్లు అంటూ పరిమితుల మాట ఎలా ఉన్నా.. జీవరాశి మనుగడకు పెనుముప్పుగా పరిణమించాయనేది ఎన్నో సర్వేలు తేల్చిన నిజం. అయినా జనం పెడచెవిన పెడుతుండగా ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోవడం లేదు. వ్యర్థాల్లో సగానికి పైగా ఉంటున్న ప్లాస్టిక్, వాటిలోని అధిక శాతం పాలిథీన్ సంచులు, గ్లాసులు, వాటర్ బాటిళ్లు డ్రైన్లలో మురుగునీరు సాఫీగా వెళ్లకుండా అడ్డుకొని ముంపునకు కారణమవుతున్నాయి. చివరికి సముద్రంలోని తాబేళ్లు తదితర జలజీవులు ప్లాస్టిక్ వస్తువుల వల్ల మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ సంచుల్లో కూరలు, కూరగాయలు తదితర ఆహార పదార్థాలు తీసుకురావడం. ప్యాకేజింగ్‌కి వాటిని వాడడం, టిఫిన్ ప్లేట్లలో వేసుకోవడం, ప్లాస్టిక్ కోటింగ్‌తో తయారుచేసిన కృత్రిమ ఆకులు, గ్లాసులను వాడడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని వినియోగించడం వంటి వాటి వల్ల ఒక మనిషి శరీరంలోకి వారానికి సగటున 5 గ్రాముల మైక్రో ప్లాస్టిక్‌లు చేరుతున్నాయని ఓ సర్వే భయంకరమైన నిజాన్ని బయటపెట్టింది. ప్లాస్టిక్ తయారీకి ముడి చమురును మూల పదార్థంగా వాడతారు. వివిధ ఆకృతులు, రంగులు రావడానికి ఎన్నో రసాయనాలు కలుపుతారు. వాటిలో సీసం, కాడ్మియం తదితర రసాయనాల వల్ల రకరకాల క్యాన్సర్లు, హార్మోన్ అసమతుల్యత, గర్భం దాల్చడంలో ప్రతికూలతలు, చర్మ వ్యాధులు, శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం.. ఇలా రకరకాల రుగ్మతల బారిన పడుతున్నామని వివిధ సర్వేలు చెవిలో పోరు పెడుతూనే ఉన్నాయి.

● జిల్లాలో రోజుకు 50 టన్నులు..

తూర్పుగోదావరి జిల్లాలో రోజుకు సగటున 200 టన్నుల వ్యర్థాలు వేడుకలు, గృహాలు, వాణిజ్య ప్రదేశాల నుంచి ఉత్పత్తి అవుతున్నాయి. వాటిలో కనీసం 50 టన్నులపైనే ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయనేది చేదు నిజం. వీటిలో అధిక శాతం సింగిల్ యూజ్ పాలిథీన్, ఆహార పదార్థాల ప్యాకింగ్ కవర్లే ఉంటున్నాయి. జిల్లాలో 90 శాతం రాజమహేంద్రవరంలోనే వాడుతున్నారు. అయితే కింది స్థాయి సిబ్బందికి డబ్బులు వచ్చే మార్గంగా జరిమానాల తంతు మారిపోయింది. అసలు అవి విక్రయించే హోల్‌సేల్ దుకాణాల్లో ఎందుకు తనిఖీలు చేయడం లేదో అర్థంకాదు. దుకాణాల ద్వారా రోజూ కనీసం టన్ను వరకూ పాలిథీన్ కవర్లు జనాల్లోకి వెళుతున్నాయని ఓ అంచనా ఉంది. వీటన్నిటిపై కలెక్టర్ దృష్టి సారించడంతోపాటు నార, గుడ్డ, కాగితం సంచులు, గ్లాసులను విరివిగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అత్యవసరం.

● పట్టుబడితే వెయ్యి జరిమానా

జిల్లాలోని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థతోపాటు అన్ని స్థానిక సంస్థలనూ కలెక్టర్ అప్రమత్తం చేశారు. ప్రత్యేక తనిఖీ బృందాలను నియమించారు. నిబంధనలకు విరుద్ధంగా 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు వంటివి దుకాణాల్లో ఉంటే వెయ్యి రూపాయల జరిమానా విధిస్తున్నారు. అలాగే ప్రజల వద్ద ఉన్నా జరిమానాకు గురి కావాల్సిందే. ప్రభుత్వ కార్యక్రమాల్లో తాగునీటికి ప్లాస్టిక్ గ్లాసులు, తినడానికి ప్లాస్టిక్ ప్లేట్లు, స్పూన్లు, బౌల్స్ సహా ప్లాస్టిక్ వాడొద్దంటూ ఇప్పటికే కలెక్టర్ ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని 95 సచివాలయాల్లో ఉన్న 900 మంది కార్యదర్శులు రోజూ తనిఖీలు చేయాలని, అవగాహన కల్పించాలని కూడా ఆదేశించారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించే ఉద్దేశంలో ఉన్నారు. అయితే కలెక్టర్‌కి సిబ్బంది చిత్తశుద్ధి, ప్రజల బాధ్యత తోడయితేనే ప్లాస్టిక్ ఫ్రీ తూర్పు సాకారమవుతుందనేది నిర్వివాదాంశం. వాస్తవానికి ఒక్క పాలిథీన్ కవరు భూమిలో కలవడానికి 10 లక్షల సంవత్సరాలు పడుతుందట. ఈలోపు అది చేసే కీడు అంతాఇంతా కాదు. పాలిథీన్ సంచులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే నిబద్ధతతో యంత్రాంగం నిషేధాన్ని అమలుచేయాలి. దీనిలో రాజకీయ నాయకులు కూడా భాగస్వామ్యం కావాలి. జరిమానాలకు పరిమితం కాకుండా విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి. జనపనార, వస్త్రంతో చేసిన సంచుల తయారీదారులను ఉదారంగా ప్రోత్సహించాలి. తక్కువ ధరకు అందుబాటులోకి విస్తృతంగా తీసుకురావాలి. స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పంపిణీ చేయడానికి చొరవ చూపాలి. బంగాళా దుంపలతో తయారు చేసిన సంచులను బ్రిటన్, జపాన్‌లో విరివిగా వాడుతున్నారు. బంగాళా దుంప నుంచి తీసే పిండి బయోపాలిమర్ ప్లాస్టిక్ లక్షణాలను కలిగి ఉంటుంది. కాబట్టి ఇది కొద్దిరోజులకే భూమిలో కలిసి పోవడంవల్ల పర్యావరణానికి హాని ఉండదు.

ప్లాస్టిక్ ఫ్రీ తూర్పు : కలెక్టర్

ప్లాస్టిక్ ఫ్రీ తూర్పుగోదావరిని చూడడమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో చర్యలకు ఉపక్రమించాం. ముందుగా రాజమహేంద్రవరంపై ఫోకస్ చేశాం. ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా మారుస్తాం. విస్తృతంగా తనిఖీలు చేయడంతోపాటు ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ వంటి రోగాలు వస్తాయని అవగాహన కూడా కల్పిస్తున్నాం. నేనే స్వయంగా తనిఖీలకు వెళుతున్నాను. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇంటి నుంచి నార, గుడ్డ, కాగితం సంచిని తీసుకెళ్తే చాలా వరకూ సమస్యకు పరిష్కారం దొరికినట్టే. ఆరోగ్య రక్షణ, పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కోరుతున్నాం.

సంద్రోదయం!



కాకినాడ సముద్ర తీరంలో ఉదయం పూట ఆకట్టుకుంటున్న సూర్యోదయం -(స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, కాకినాడ)

సూర్యాస్తమయం!



రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద సూర్యాస్తమయాన శివలింగం -(స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం)

'ఏలేరు' వెలవెల!



ఏలేరు జలాశయంలో కనిష్ఠ స్థాయిలో ఉన్న నీటి నిల్వలు

- ఏలేరు జలాశయంలో అంతంత మాత్రంగానే జలాలు
- ఖరీఫ్‌పై రైతుల ఆందోళన

ఏలేశ్వరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వర్షాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఏలేరు జలాశయంలో వర్షపు నీరు చేరలేదు. ఏలేరు ప్రాజెక్టులో తక్కువ జలాలు ఉండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షాలు రాకపోతే మెట్ట రైతులకు గడ్డుకాలం తప్పేదిలేదు. మెట్ట అవసరాలు తీర్చే ఏలేరు పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 86.56 మీటర్లకు 24.11 టీఎంసీలు. ప్రస్తుతం ప్రాజెక్టులో 77.31మీటర్ల స్థాయిలో కేవలం 10.52 టీఎంసీలు జలాలే ఉన్నాయి. ప్రత్తిపాడు, పెద్దాపురం, పిఠాపురం నియోజక వర్గాల పరిధిలో 64 ఎకరాల ఖరీఫ్ సాగు ఇప్పటికే ప్రారంభమైంది. ప్రస్తుతం ఉన్న టీఎంసీల్లో నిబంధనల ప్రకారం ఆరు టీఎంసీలు ప్రాజెక్టులో ఉంచాలి. మిగతా టీఎంసీల నుంచి విశాఖ పారిశ్రామిక, తాగు నీరు, సాగు అవసరాలకు అందించాలి. నాలుగు టీఎంసీలు జలాలను వ్యవసాయం, విశాఖకు ఎలా సర్దుబాటు చేయాలనే ఆందోళన అధికారుల్లో ఉంది. ప్రస్తుతం సాగుకు 300క్యూసెక్కుల వంతున, ఎడమ కాలువ నుంచి విశాఖకు 150క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.

ఖరీఫ్‌పై అనుమానాలు

ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గడంతో ప్రస్తుత నీటి నిల్వలపై రాబోయే రోజుల్లో ఖరీఫ్ సాగుపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతుల వారీ విధానంలో ప్రాజెక్టు నుంచి విడుదల చేసే నీరు నిర్ధారిత ఆయకట్టుకు చేరకపోవడమే రైతులకు ప్రధాన సమస్యగా మారింది. కాలువల ఆధునికీకరణకు నోచుకోక కాలువలు ఇప్పటికే అధ్వానంగా ఉన్నాయి. ప్రాజెక్టులో నీటి నిల్వను బట్టే ఆయకట్టులో సాగునీరు ఆధారపడి ఉంటుంది. అలాంటప్పుడు నీటి నిల్వలు తగ్గుదలతో రైతులు నిరాశకు గురవుతున్నారు.

విశాఖకు నీరు తరలింపు

ఏలేరు ప్రాజెక్టులో నీటినిల్వలు గణనీయంగా తగ్గిపోవడంతో విశాఖకు నీటిని తరలించడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రాజెక్టులో నీటిని మోటార్ల సహాయంతో పైపుల ద్వారా 150 క్యూసెక్కుల నీటిని తరలించడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, పశువులకు నీరు లేక అనేక ఇబ్బందులు పడుతుంటే విశాఖకు నీరు పంపించడంపట్ల పలు విమర్శలు వస్తున్నాయి.

ఆదివాసీలకు 100శాతం ఉద్యోగాల రిజర్వేషన్ కల్పనపై కసరత్తు

- గిరిజన సంక్షేమ సంచాలకులు భార్గవి

రంపచోడవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రాంతాల్లోని ఉద్యోగాల్లో ఆదివాసీలకు వందశాతం రిజర్వేషన్ వర్తింపజేసేలా జీవో నెం.3లోని ఫలాలను పునరుద్ధరించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని గిరిజన సంక్షేమ సంచాలకులు ఎస్.భార్గవి అన్నారు. రంపచోడవరం ఐటీడీఏలో బుధవారంనిర్వహించిన ఆదివాసీ వర్గాలు, మేధావుల సదస్సులో ఆమె మాట్లాడారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్‌కలెక్టరు కల్పశ్రీలతో కలిసి పలువురి అభిప్రాయాలను సేకరించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులతో రద్దయిన జీవో నెం.3ని పునరుద్ధరించాలంటూ జరిగిన ఉద్యమాలు, వినతుల నేపథ్యంలో ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోవాలన్న అంశంలో నిర్దేశిత ప్రొఫార్మాలో అభిప్రాయాలను తీసుకుంటున్నామని ఆమె అన్నారు. ప్రతి ఐటీడీఏ పరిధిలోను ఈ అభిప్రాయాలను తీసుకుంటున్నామన్నారు. వీటిని క్రోడీకరించి ప్రభుత్వానికి సమర్పించి జీవో నెం.3 పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను ఖరారు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ సరైన రాజ్యాంగసవరణ ద్వారానే గిరిజన హక్కులు, రిజర్వేషన్లు పరిరక్షిస్తామన్నారు. ఆదివాసీ నాయకులు కంగల శ్రీనివాసరావు దొర, మిడియం శ్రీనివాసరావు, కొవ్వాసి శ్రీనివాసరావు, గొర్లె చిన్ననారాయణరావు, కత్తుల ఆదిరెడ్డి, మడి నెహ్రూ, వంతు బాలకృష్ణ, లోతా రామారావు, శరంకోట అబ్బాయిరెడ్డి, కింటుకూరి లక్ష్మణరావు, గిరిజన చట్టాల సలహాదారు, పి.త్రినాధరావు, న్యాయవాదులు కె.సత్యప్రసాద్, ఎ.నవీన్‌కుమార్, ఎం.రవితేజ తమ అభిప్రాయాలను వెల్లడించారు.



సదస్సులో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ సంచాలకులు ఎస్.భార్గవి

ఇంజనీరింగ్ కళాశాలల్లో..
పరిశోధనలకు పెద్దపీట వేయాలి

- సౌత్ ఏషియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకే అగర్వాల్
- జేఎన్‌టీయూకేలో యూసీఈకే ఓక్ ఉత్సవాలు ప్రారంభం



ఓక్ ఉత్సవాల్లో భాగంగా ఏడాదిపాటు చేపట్టే కార్యక్రమాల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

జేఎన్టీయూకే, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో 4నుంచి 5వేల వరకూ ఇంజనీరింగ్ కళాశాలలున్నా వాటిలో 100 కళాశాలలు కూడా చెప్పుకోదగినవి కాదని, అన్ని కళాశాలలు ఐఐటీ స్థాయికి చేరలేవు కానీ స్వయం ప్రతిపత్తితో సాంకేతిక విద్యలో నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతూ పరిశోధనలకు పెద్దపీట వేయాలని సౌత్ ఏషియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకే అగర్వాల్ సూచించారు. కాకినాడ నగరంలో 1946లో ఏర్పాటైన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల(యూసీఈకే) 2025, జూలై 16 నాటికి 79ఏళ్లు పూర్తి చేసుకుని 80వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఓక్ ఉత్సవాలు వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల ద్వారా ప్రజలకు యూసీఈకే కళాశాల ప్రతిష్టను తెలియజేయనున్నారు. ఏడాదిపాటు అనగా 2025, జూలై 16 నుంచి 2026, జూలై 15 వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా న్యూఢిల్లీలోని సౌత్ ఏషియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకే అగర్వాల్ ప్రారంభించగా గౌరవఅతిథిగా యూజీసీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వేద్ ప్రకాష్, ప్రత్యేక అతిథులుగా పూర్వ విద్యార్థులు ఐఐటీ మద్రాస్ నుంచి సీఎస్ఈ ప్రొఫెసర్ డి.జానకిరాం, బెంగళూరులోని ఎక్స్ఐఎంఈ పరిశోధనా విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్.ఎం.కే భట్టా, ఇన్వెకాస్ చైర్మన్ దశరధ్ గుడే హాజరుకాగా జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కేకే అగర్వాల్

ఈ సందర్భంగా అగర్వాల్ మాట్లాడుతూ ఒకదేశం ప్రగతివైపు పయనించాలంటే సాంకేతికత వెన్నెముక అయి ఉండాలన్నారు. ఇంజనీరింగ్ విద్యలో ఇంకా పాఠ్యప్రణాళికలోను మార్పులు తీసుకురావాలని సూచించారు. ఓక్ వేడుకల్లో భాగంగా ఏడాదిపాటు నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికకు సంబంధించిన క్యాలెండర్‌ను అతిథులు ఆవిష్కరించారు. వేద్ ప్రకాష్ మాట్లాడుతూ గత 50ఏళ్లలో 47 యూనివర్సిటీలను కొలమానంగా తీసుకోగా మూడు విశ్వవిద్యాలయాలు మాత్రమే నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాయన్నారు. రష్యా, చైనా దేశాల మాదిరిగా ప్రగతి సాధించాలంటే సైన్స్‌ను బోధించడంలో ముందడుగు వేయాలని సూచించారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంకు పొందేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. 17, 18 తేదీల్లో రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ఇన్ స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్, రిజిస్ట్రార్, పలువురు డైరెక్టర్లు, మాజీ వీసీలు పాల్గొన్నారు.

కళాశాలలు ప్రతి విద్యా సంవత్సరం
అకడమిక్ ఆడిట్ నిర్వహించాలి

జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్



మాట్లాడుతున్న ప్రసాద్

జేఎన్టీయూకే, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్సిటీ అనుబంధ కళాశాలలన్నీ ప్రతి విద్యా సంవత్సరం అకడమిక్ ఆడిట్ నిర్వహించాలని జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ సూచించారు. కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో వర్సిటీ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, కార్యదర్శులు, కరస్పాండెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కళాశాలల్లో నైపుణ్యతా ప్రమాణాలను పెంచేందుకు చేపట్టిన వినూత్న ఇనీషియేటివ్స్‌ను వివరించారు. సిలబస్, రెగ్యులేషన్స్ నవీనీకరణ, పరిశోధనలకు పెద్దపీట వేయడం, విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉండే అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఓపెన్ లెర్నింగ్, ఓడీఎల్ కోర్సులను మూక్స్ విద్యా విధానాలను ప్రోత్సహిస్తున్నామని, విదేశీ విశ్వవిద్యాలయాలతో ఎంఓయూ ద్వారా మంచి బీటెక్, ఎంటెక్ ప్రోగ్రామ్‌లు నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మీట్, గ్రీట్ విత్ వీసీ కార్యక్రమంలో రెక్టార్ వీవీ సుబ్బారావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.



కేంద్ర సహాయ మంత్రి మాండవియాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఎంపీ సతీష్‌బాబు

హాకీకి ప్రత్యేక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేయాలి

కేంద్ర సహాయ మంత్రికి రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు వినతి

కాకినాడ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన, క్రీడల శాఖ సహాయ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియాను ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు పాల్గొన్నారు. కాకినాడలో హాకీకి ప్రత్యేక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని మంత్రిని ఎంపీ సతీష్‌బాబు అభ్యర్థించగా ఈ ప్రతిపాదనను ఆమోదించాలని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఈ సెంటర్ ఏర్పాటుచేస్తే జాతీయ క్రీడా పటంలో కాకినాడ స్థానం సంపాదించుకుంటుందని, యువతకు ప్రపంచ స్థాయి మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయన్నారు.

1.62 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి...

ధవళేశ్వరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవాహం క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంటోంది. బుధవారం సాయంత్రం కాటన్ బ్యారేజీ నుంచి మొత్తం 175 గేట్లను 30 మిల్లీమీటర్లపైకి ఎత్తి 1,62,092 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల కోసం కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 5వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,600 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7వేల క్యూసెక్కుల చొప్పున సాగు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద నీటిమట్టం మరింత తగ్గి బుధవారం సాయంత్రానికి 15.50 అడుగులకు చేరుకుంది.

యోగా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

దివాన్‌చెరువు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా పీజీ డిప్లొమా ఇన్ యోగా, యోగా సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నన్నయ ప్రాంగణంతో పాటు కానవరంలోని శ్రీరా పర్తి యోగా సంస్థలో 50 సీట్ల చొప్పున వున్నాయన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన స్త్రీ, పురుషులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 17 నుంచి వచ్చే నెల 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆగస్టు 21న కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులు రూ.6వేలు, బయటివారు రూ.10వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మూడు నెలల యోగా సర్టిఫికెట్ కోర్సును నన్నయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని, దీనికి ఆగస్టు 25న కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఫీజు విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులకు రూ.1,500, బయటివారికి రూ.3వేలు కౌన్సెలింగ్ ప్రక్రియను విశ్వవిద్యాలయ డీవోఏ ఆచార్య పి.ఉమామహేశ్వరీదేవి నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ లేదా 73823 0 8440 నెంబరును సంప్రదించాలి.



బీర... బారెడు

ఈ బీరకాయలు బారెడు పొడవు ఉండి నిగనిగలాడిపోతున్నాయి. మీటరు బద్దంత పొడవు ఉన్న ఒక్కో బీరకాయ ధర కూడా బారెడే ఉంది. సీతానగరం గ్రామం నుంచి దిగుమతి చేసుకున్న బీరకాయలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. కిలో బరువున్న ఒక్కో బీరకాయ రిటైల్ మార్కెట్లో రూ.60 నుంచి రూ.80 పలుకుతోంది.

- అమలాపురం టౌన్ (ఆంధ్రజ్యోతి)

అడవుల సంరక్షణలో కీలక పాత్ర పోషించాలి

బీట్ అధికారుల స్నాతకోత్సవంలో ఏపీసీసీఎఫ్ శాంతిప్రియ పాండే

దివాన్‌చెరువు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అడవుల పరిరక్షణ, నిర్వహణలో అటవీ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర అదనపు ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి (మానవవనరుల అభివృద్ధి, వన్యప్రాణులు) డాక్టర్ శాంతిప్రియపాండే అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీ ప్రాంగణంలో 12వ బ్యాచ్ అటవీ బీట్ అధికారుల స్నాతకోత్సవం అకాడమీ డైరెక్టర్ బి.విజయకుమార్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శాంతిప్రియ పాండే మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో అమలు చేసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ అటవీ అకాడమీని గతంలో కంటే ప్రస్తుతం కొంత అభివృద్ధి చేశామని చెప్పారు. శిక్షణార్థులు జీవితంలోను, కెరీర్‌లోను మంచి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.



శిక్షణలో ప్రతిభ చూపిన ఉద్యోగికి పతకం, సర్టిఫికెట్ అందజేస్తున్న శాంతిప్రియపాండే

రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం దివాన్‌చెరువు వద్ద ఏర్పాటుచేసిన ఈ అటవీ అకాడమీలో ఇంతవరకు 500 మంది ఉద్యోగులకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రస్తుత బ్యాచ్‌లో 40 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారన్నారు. వీరంతా విధి నిర్వహణలో ఆదర్శంగాను, గేమ్ ఛేంజర్లుగాను నిలవాలని కోరారు. రాజమహేంద్రవరం సీసీఎఫ్ బీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ ప్రకృతి సంపదను పరిరక్షించే అటవీ శాఖలో పనిచేయడం భగవంతుడు ఇచ్చిన గొప్పవరంగా భావించాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలతో పాటు జ్ఞాపికలను శాంతిప్రియపాండే అందజేసి అభినందించారు. అంతకు ముందు జరిగిన పాసింగ్ పరేడ్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర పీసీసీఎఫ్ (హెచ్‌వోఎఫ్ఎఫ్) ఏకే నాయక్ శిక్షణార్థులనుద్దేశించి వర్చువల్ విధానంలో ప్రసంగించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ రామారావు, అటవీ శాఖ జిల్లా అధికారి వి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ గోదాముల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్యామ్‌కుమార్

ప్రభుత్వ గోదాములను సద్వినియోగం చేసుకోవాలి

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యామ్‌కుమార్

కరప, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఉత్పత్తులను అయినకాడికి అమ్మి రైతులు నష్టపోతున్నారని, దీని నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిడ్డంగుల అభివృద్ధి, నియంత్రణ సంస్థ (డబ్ల్యూడీఆర్ఏ)ను ఏర్పాటు చేసిందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యామ్‌కుమార్ తెలిపారు. కాకినాడ జిల్లా కరప ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయంలో డబ్ల్యుడీఆర్ఏపై బుధవారం రైతులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునే సమయంలో గిట్టుబాటు ధర లేక, నిల్వ ఉంచుకునే పరిస్థితి లేక, చేసిన అప్పులు, పెట్టుబడులకు డబ్బులు లేక అయినకాడికి అమ్ముకుంటున్నారన్నారు. ఈ పరిస్థితిని నివారించి అధిక ధర వచ్చినపుడు అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం ఎక్కడికక్కడ వేర్ హౌసింగ్ గోదాములను ఏర్పాటు చేసిందన్నారు. కరప మండలం నడకుదురులో ఉన్న గోదాములు ఇలా ఏర్పాటు చేసినవేనన్నారు. రైతులు తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వచ్చేంతవరకు ఈ గోదాముల్లో నామమాత్ర రుసుముతో నిల్వ చేసుకోవచ్చన్నారు. ఇలా నిల్వ చేసిన సరుకుపై 80శాతం వరకు బ్యాంకులు తక్షణ రుణ సదుపాయం కల్పిస్తాయని చెప్పారు.

అనంతరం నడకుదురులోని గోదాముల వద్దకు రైతులను తీసుకెళ్లి వాటివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులకు భోజన సదుపాయం ఏర్పాటుచేసి శిక్షణ కిట్లు, మెటీరియల్, రూ.300 చొప్పున స్టైపండ్ పంపిణీ చేశారు. డీసీఏవో, ఇన్‌చార్జ్ డీఎల్‌సీవో పీపీఎంఎం కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్‌వీవీఎస్ఎస్ఆర్‌కే దుర్గాప్రసాద్, కోస్టల్ బ్యాంక్ విజయవాడ క్లస్టర్ హెడ్ వి.రవికుమార్, ఐసీఐసీఐ బ్యాంక్ రాజమహేంద్రవరం ఆర్ఎం ఎ.మురళీకృష్ణ, ఎన్ఈఆర్‌సీ అభిలాష్, సొసైటీ సీఈవో చందు, తమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఎంపీపీలు, జడ్పీటీసీలకు
ముగిసిన శిక్షణ

సామర్లకోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మహిళా ఎంపీపీలు, జడ్పీటీసీలకు మూడు రోజుల జరిగిన శిక్షణ బుధవారం విజయవంతంగా ముగిసింది. సాయంత్రం వైస్ ప్రిన్సిపాల్ రమణ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ కేఎన్వీ ప్రసాదరావు శిక్షణార్థులకు సరిఫికెట్లు అందజేశారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకుని 'మార్పు ద్వారా విజేతలు' కార్యక్రమ లక్ష్యాలను నెరవేర్చాలని కోరారు. సభల నిర్వహణను వైకుంఠపాళీ ఆటగా నేర్పడం విశేషంగా ఆకట్టుకుంది. మహిళలు పాలకులైతే సమగ్ర అభివృద్ధి సాధ్యమన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం వారికి భాగస్వామ్యం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో డీడీవో శ్రీనివాసరావు, ఎంపీడీవోలు సుశీల, శర్మ పాల్గొన్నారు.



శిక్షణార్థికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాదరావు



వెల్లువగా వచ్చి విల్లులా మారి..

కాకినాడ నగరంలో బుధవారం సాయంత్రం కనిపించిన దృశ్యమిది.. ఆకాశంలో పక్షులు విల్లు ఆకారంలో ఎగురుతూ గుంపుగా సందడి చేశాయి. వెంటనే ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

మెనూ మారే!

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటకాల్లో మార్పులు

రాజమహేంద్రవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పేరుతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పటి వరకూ ఉన్న మెనూ కాకుండా కొత్త మెనూ అమలు చేయనున్నారు. అయితే ఈ మెనూలో కొన్ని వంటకాలు పిల్లలు ఇష పడే విధంగా లేవని చెబుతున్నారు. ఉదాహరణకు శుక్రవారం పులి హోర, గోంగూర/ కాయగూరల పచ్చడి, ఉడికిం చిన గుడ్డు ఇవ్వాలని పేర్కొన్నారు. అన్నీ డ్రై వంటకాలు కావడంతో పిల్లలు తినడానికి ఇబ్బంది పడతారని, అరుగుదల నెమ్మదిస్తే కడుపు నొప్పి వంటివి వస్తాయని ఎండీఎం కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోజు	ఇప్పటివరకూ	ఇకపై మెనూ
సోమవారం	కూరగాయల కూర/ ఆకుకూరపప్పు, వేపిన గుడ్డు	ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు
మంగళవారం	పులిహోర/నిమ్మరైస్, గుడ్డు, పచ్చడి, రాగిజావ	గుడ్డు కూర, పప్పు, రసం, రాగిజావ
బుధవారం	కలగలుపు కూర, గుడ్డు	వెజ్ పులావ్, బంగాళా దుంప కుర్మా, ఉడికించిన గుడ్డు
గురువారం	అన్నం/పలావు, ఆలూ కుర్మా, గుడ్డు	సాంబారు, గుడ్డు కూర, రాగిజావ
శుక్రవారం	ఆకుకూర పప్పు, వేపిన గుడ్డు	పులిహోర, చట్నీ, గుడ్డు
శనివారం	కలగలుపు కూర, స్వీట్ పొంగల్	కలగలుపు కూర, రసం, రాగిజావ, స్వీట్ పొంగల్

గమనిక: రోజూ తెల్ల అన్నం మామూలే

వసతి గృహాల్లో పోస్టుల భర్తీకి జిల్లాలవారీగా సమీక్ష : మంత్రి డోలా



మాట్లాడుతున్న మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

ఉప్పలగుప్తం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న సంక్షేమ అధికారుల పోస్టులు భర్తీకి జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. వైసీపీ హయాంలో సౌకర్యాల లేమితో కునారిల్లిన వసతి గృహాలను చక్కదిద్దేందుకు పక్కా ప్రణాళిక ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి వివరించారు. బుధవారం కోనసీమ జిల్లా భీమనపల్లిలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ స్వగృహంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వసతి గృహాలు, గురుకులాలను సందర్శించి అక్కడి పరిస్థితులను అవగాహన చేసుకుంటున్నట్టు తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి ఆహారం, వసతి తదితర అంశాలపై అభిప్రాయాలను తెలుసుకుంటున్నట్టు వివరించారు. విభిన్న ప్రతిభావంతులకు కూటమి ప్రభుత్వంలో వసతుల కల్పన జరుగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల విషయంలో కూటమి సర్కారు కచ్చితంగా వ్యవహరిస్తుందన్నారు. గతంలో ఉన్న నిబంధనల మేరకే నిధులు ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలకు వినియోగించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి, ఎస్సీఎస్టీలను వంచించిందని మంత్రి ఆరోపించారు. కార్యక్రమంలో భీమనపల్లి సొసైటీ చైర్మన్ ఆకేటి శ్రీనివాసరావు(పెద్ద), ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, టిడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్ పాల్గొన్నారు.

‘తల్లికి’ ఆనందమేది!

● 40 విద్యుత్ సర్వీసులు ఉన్నట్టు తప్పుడు నివేదికలు

● ఒంటరి మహిళల బాధలు ● ఖాతాల్లో పడని డబ్బులు



నాగ సత్య గంగా భవాని

సామర్లకోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తల్లికి వందనం పథకం పేరిట తల్లుల ఖాతాల్లో డబ్బులు వేసి ఆనందం నింపుతోంది. అయితే కొందరు తల్లులకు మాత్రం ఆ ఆనందం దక్కడంలేదు. కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన కటకం నాగసత్య గంగా భవానికి ఇద్దరు చిన్నారులు. ఆమెకు తల్లికి వందనం మంజూరు కావాల్సి ఉన్నప్పటికీ ఆమె పేరిట 40 విద్యుత్ సర్వీసులు ఉన్నట్టు నివేదికలు చూపడంతో తీవ్ర ఆందోళన చెందింది. దీంతో సామర్లకోటలోని జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ అధికారుల వద్ద వివరణ కోరారు. దీంతో సదరు మహిళ పేరిట 40 సర్వీసులు ఉన్నట్టు చెప్పడంతో కనీసం సొంత ఇల్లు కూడా లేని తనకు విద్యుత్ సర్వీసులు ఎలా ఉంటాయని ఆమె ప్రశ్నించింది. అధికారులు చేసిన తప్పుడు నివేదికలను తొలగించేందుకు ఒక్కొక్క సర్వీసుకు రూ.35 చెల్లించి దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని అధికారులు చెప్పారు. దీంతో ఆమె తన పేరిట ఉన్న 40 సర్వీసుల తొలగింపు చర్యల నిమిత్తం రూ.1800 చెల్లించింది. జిల్లా ఉన్నతాధికారులు సత్వరం సమగ్ర దర్యాప్తు జరిపి తల్లికి వందనం పథకం తనకు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే తన ఇద్దరి పిల్లల చదువు అర్థాంతరంగా ముగించాల్సి వస్తుందని గంగాభవాని వాపోయింది. కాగా ఈ విషయమై కాకినాడ జిల్లా కలెక్టర్‌కు నూతలపాటి అప్పలకొండ వినతి పత్రం అందజేశారు.

ఫ్రీ సీటు మెలిక..

సర్పవరం జంక్షన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం వలసపాకల కృష్ణుడు గుడి వీధిలో నివాసం ఉంటున్న మల్లెల రాఘవకు కుమారుడు శ్రీహర్ష (9), సంగాని లోవలక్ష్మికి కుమారుడు శశివరుణ్(9) ఉన్నారు. ఆ మహిళల్ని భర్తలు విడిచిపెట్టి వెళ్లిపోయారు. దాంతో ఒంటరిగా ఉంటూ కాయకష్టం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. పిల్లలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశం కల్పించారు. శ్రీకాంత్ పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతిలో చేరాడు. రెండో తరగతి భాష్యం స్కూల్లో చేర్పించారు. ఇక్కడ ఉచిత విద్యా సౌకర్యం లేకపోయినా ‘తల్లికి వందనం’ వస్తుందనే భరోసాతో తమ ఇళ్ల సమీపంలోని స్కూల్లో ఇద్దరు పిల్లలను చేర్పించినట్టు తల్లులు రాఘవ, లోవలక్ష్మి తెలిపారు. తమకు ఈ పథకం కింద డబ్బులు రాకపోవడంతో అధికారులను అడుగుతున్నా ఏ సమాచారం చెప్పట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు ప్రభుత్వం తరఫున ఫ్రీ సీటు లభించడం, ఆన్‌లైన్‌లో ఇంకా ఉచితంగానే చదువుతున్నట్టు ఉండడంతో రూ.13వేలు రాలేదని అధికారులు చెప్తోరన్నారు. ప్రభుత్వం ఒంటరి మహిళలకు ఇచ్చే వితంతు పింఛను కూడా అధికారులు తమకు ఇవ్వట్లేదని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



తల్లికి వందనం రాలేదని వాపోతున్న మల్లెల రాఘవ, సంగాని లోవలక్ష్మి

కోటసత్తెమ్మకు ఎమ్మెల్సీ సోము వీర్రాజు పూజలు



సోము వీర్రాజుకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

నిడదవోలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసిన కోటసత్తెమ్మ వారిని బుధవారం ఎమ్మెల్సీ సోము వీర్రాజు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు దేవస్థానం సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్ స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శనం అనంతరం అమ్మవారిచిత్రపటం అందజేశారు.

సత్యదేవుడికి ఎస్పీ పూజలు



దర్శనానంతరం కాకినాడ ఎస్పీ కుటుంబం

అన్నవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో బుధవారం కాకినాడ జిల్లా ఎస్పీ జి.బింధుమాదవ్ కుటుంబసభ్యులతో స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామి ప్రసాదం అందజేశారు.

రేపు ‘లోవ’లో ప్రత్యేక పూజలు

తునిరూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తలుపులమ్మ లోవ క్షేత్రంలో ఈనెల 18న ఆషాఢ మాస ఆఖరి శుక్రవారం ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయన ఈవో తెలిపారు. సామూహిక కుంకుమార్చనలో పాల్గొనే భక్తులకు పూజా ద్రవ్యములు, ఉచిత ప్రసాదం అందిస్తామని పేర్కొన్నారు.

ఆగస్టు 3న జాతీయ చెస్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న హైమావతి తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆగస్టు 3న ఓపెన్ జాతీయ చెస్ పోటీలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నామని టోర్నమెంట్ డైరెక్టర్ విత్తనాల హైమావతి తెలిపారు. ఈ మేరకు టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరించి హైమావతి మాట్లాడుతూ ఆల్ ఇండియా ఇండిపెండెన్స్ టోర్నమెంట్ పేరుతో లోరియల్ హై గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో కాల్ ఫ్యూజన్ చెస్ అకాడమీ ఈ పోటీలను నిర్వహిస్తుందన్నారు. విజేతలకు రూ.1,23,456 నగదు బహుమతి అందజేయడం జరుగుతుందన్నారు. పోటీలకు దేశం నలుమూలల నుంచి సుమారు 400 మంది చెస్ క్రీడాకారులు వస్తారని భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సుంకర రవికుమార్, ప్రిన్సిపాల్ ఏక్తా, చెస్ అకాడమీ డైరెక్టర్ విత్తనాల కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎస్ఐ, కానిస్టేబుల్ కుటుంబాలకు ఆర్థిక సాయం



ఎస్ఐ అశోక్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే బండారు

అలమూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోనసీమ జిల్లా అలమూరు ఎస్ఐ ఎం.అశోక్, కానిస్టేబుల్ బ్లెసన్ కుటుంబాలకు రూ.16.5లక్షల ఆర్థిక సాయాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అందజేశారు. ఎమ్మెల్యే బండారు అభిమానులు సేకరించిన ఈ మొత్తంలో ఎస్ఐ అశోక్ కుటుంబానికి రూ.12లక్షలు, కానిస్టేబుల్ బ్లెసన్ కుటుంబానికి రూ.4.5లక్షలు అందించారు. ఎస్ఐ కుటుంబానికి రాజమండ్రిలో, కానిస్టేబుల్ కుటుంబానికి ఆలమూరులో ఎమ్మెల్యే బండారు చేతుల అందించారు. కార్యక్రమంలో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, నాయకులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తల్లి, భార్యకు గొడవలు... నచ్చచెప్పలేక వ్యక్తి ఆత్మహత్య

కరప, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తరచుగా గొడవలాడుకుంటున్న కన్న తల్లి, కట్టుకున్న భార్యకు నచ్చచెప్పలేక వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కరప పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లికి చెందిన చోడిశెట్టి మణికంఠ(34)కు రెండేళ్ల క్రితం కీర్తనతో వివాహమైంది. వారికి చిన్నారి పాప ఉంది. తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న మణికంఠకు తల్లి, భార్య మధ్య గత ఆర్నెళ్లుగా జరుగుతున్న గొడవలతో మనశ్శాంతి కరువయ్యింది. ఎవరికీ నచ్చచెప్పలేని దుస్థితిలో జీవితంపై విరక్తి పెంచుకున్న మణికంఠ మంగళవారం ఇంటి నుంచి బయటకు వచ్చేసి గడ్డి మందు తాగాడు. స్నేహితుడికి ఫోన్ చేసి విషయాన్ని చెప్పాడు. అపస్మారకస్థితిలో ఉన్న మణికంఠను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం బుధవారం మధ్యాహ్నం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కరప ఇన్‌చార్జి ఎస్ఐ ఆర్‌వీఎస్ మూర్తి కేసు నమోదు చేశారు.

బాలుడి అదృశ్యంపై కేసు



నాగేశ్వరరావు (ఫైల్)

రంగంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో బాలుడు అదృశ్యంపై బుధవారం కేసు నమోదు అయిందని ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు. వివరాల ప్రకారం.. అల్లూరి సీ తారామరాజు జిల్లా గంగవరం మండలం రామవరం గ్రామానికి చెందిన కొంబర్లు నాగేశ్వరరావు (15) కుటుంబ సభ్యులతో కలిసి తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామం విశ్వజనని కోళ్ళ ఫారం నందు పనిచేసుకుంటున్నాడు. అయితే బాలుడు చిల్లరగా తిరుగుతున్నాడని అక్క తిట్టడంతో ఈనెల 14న ఉదయం 9 గంటలకు కోళ్ల ఫారం నుంచి వెళ్లిపోయాడు. అంతా వెతికినా కనిపించకపోవడంతో బావ మంగ శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. బాలుడు ఆచూకీ తెలిస్తే రంగంపేట ఎస్ఐ 9440904854, అనపర్తి సీఐ 9440796538 నెంబర్లుకు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 40మందికి కాకినాడ 5వ ఏజేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ ఎస్‌కె షరీన్ జైలు, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెపారు. కాకినాడ ట్రాఫిక్ 1, 2 సీఐలు ఎన్.రమేష్, డి రామారావు సిబ్బందితో మంగళవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరిక్షించగా 40 మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారిలో ఇద్దరికి 3 రోజుల చొప్పున జైలు శిక్ష, అలాగే మరో 8మందికి 2 రోజుల చొప్పున జైలు శిక్ష, మరో 30 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.3,00,000 జరిమానా విధించినట్టు తెలిపారు.

హైకోర్టు తీర్పుతో.. పోలీసు బందోబస్తు నడుమ
డీసీఎంఎస్ స్థలం స్వాధీనం

పాత భవనాల తొలగింపు ప్రక్రియ ప్రారంభం



అమలాపురంలో స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్న చైర్మన్ చంద్రమౌళి, మేనేజర్ శ్రీనివాస్

అమలాపురం టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): హైకోర్టు తీర్పు మేరకు పోలీసు బందోబస్తుతో కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ నడి బొడ్డున ఉన్న కోట్లాది రూపాయిల విలువైన స్థలాన్ని బుధవారం జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దశాబ్ద కాలానికి పైగా ఆ స్థలంలో అద్దెకు ఉంటున్నవారు కోర్టును ఆశ్రయించారు. చివరకు అద్దెకు ఉంటున్నవారు షాపులు ఖాళీ చేసి జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీకి అప్పగించాలని గతేడాది ఆగస్టు 19న హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఇటీవల డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పెచ్చెట్టి చంద్రమౌళి మార్కెటింగ్ సొసైటీ స్థలంపై ప్రధానంగా దృష్టి సారించారు. కోర్టు ఆదేశాల మేరకు బుధవారం డీసీఎం ఎస్ మేనేజర్ కొండేపూడి శ్రీనివాస్, సిబ్బందితో కలిసి స్థలం వద్దకు చేరుకున్నారు. పోలీసుల సహకారంతో స్థలాన్ని స్వాధీనం చేసుకుని భవనాల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. 44 సెంట్ల స్థలంలో ఉన్న భవనాలు, వృక్షాలు, చెత్తా చెదారం తొలగించి ఒక రూపు తీసుకువచ్చేలా చర్యలు చేపట్టినట్టు డీసీఎంఎస్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. చైర్మన్ చంద్రమౌళి ఆదేశాల మేరకు ఈ స్థలంలో షాపింగ్‌మాల్ నిర్మాణం చేపట్టనున్నట్టు ప్రకించారు. డీసీఎంఎస్ ఉద్యోగులు, మంథ ఫణికుమార్ ఉన్నారు.

మోటారుసైకిల్ సైకిల్ ఢీకొని వృద్ధుడి మృతి



రామకృష్ణ (ఫైల్)

గండేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన శీలం రామకృష్ణ(54) బుధవారం మల్లేపల్లి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికుల సమాచారం ప్రకారం.. రామకృష్ణ ఎక్స్‌ఎల్ మోటారు సైకిల్‌పై తన సొంతూరు బొర్రంపాలెం గ్రామం నుంచి ఫిల్టర్ మంచినీళ్ల కోసం వెళ్లి మల్లేపల్లి వచ్చి డివైడర్ దాటుతుండగా అదే మార్గంలో జగ్గంపేట వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న మోటారుసైకిల్ రామకృష్ణ మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం తెలిసిన గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి రామకృష్ణ మృతదేహాన్ని పెద్దాపురం పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శీలం రామకృష్ణకు ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి ఉన్నారు.

మహిళను గాయపర్చిన నలుగురిపై కేసు

కొవ్వూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇటుక బొంతతో మహిళను గాయపర్చిన నలుగురు మహిళలపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ మహిళా హెచ్‌సీ.లలిత తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు శ్రీరామకాలనీకి చెందిన మాసా ఏసురత్నంతో అదే కాలనీకి చెందిన కల్లు శ్రీనమ్మ, మాసా మార్త, బీర అప్పాయమ్మ, బీర సంజన ఘర్షణపడి ఇటుకబొంతతో కొట్టి గాయపర్చారు. గాయపడిన ఏసురత్నం చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చేరింది. ఆసుపత్రి నుంచి సమాచారం మేరకు ఏసురత్నం ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు మహిళా హెచ్‌సీ లలిత పేర్కొన్నారు.

డివైడర్ ఎక్కిన ట్రాక్టర్.. మరణించిన డ్రైవర్



హరీష్ (ఫైల్)

రాజానగరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం జాతీయ రహదారిపై గైట్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోట గ్రామానికి చెందిన పెనుమత్స హరీష్ (32) ఈతకోట నుంచి ట్రాక్టర్‌లో ఎరువుల బస్తాల లోడుతో శంఖవరం బయలుదేరాడు. మార్గమధ్యంలో గైట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోకి వచ్చే సరికి కళాశాల బస్సు ఒక్కసారిగా కళాశాలలోకి మళ్లించడంతో ట్రాక్టర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ట్రాక్టర్ రోడ్డు డివైడర్ ఎక్కడంతో ట్రాక్టర్ డ్రైవర్ అదుపుతప్పి కింద పడిపోయాడు. ట్రాక్టర్ ట్రక్కు డ్రైవర్‌పై మీద నుంచి వెళ్లిపోవడంతో బలమైన గాయాలుకావడంతో జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనలు మేరకు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. రాజానగరం ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేశారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

అంబాజీపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇరుసుమండకు చెందిన తోట శ్రీనివాసరావు(58) ముక్కామలలో బొండాలు విక్రయిస్తుంటాడు. మంగళవారం రాత్రి ఖాళీ బొండాలు తీస్తున్న సమయంలో వాటిలో ఉన్న ఓ రక్తపింజరం పాము కాటు వేసింది. దీంతో అతడు మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

అటవీశాఖలో 700 ఉద్యోగాల నియామకానికి చర్యలు

దివాన్‌చెరువు వద్ద అటవీ అకాడమీ నూతన భవనానికి శంకుస్థాపన

రాష్ట్ర అదనపు ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి శాంతిప్రియ పాండే



శాంతిప్రియ పాండే

దివాన్‌చెరువు, జూలై16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అటవీశాఖలో ఖాళీగా ఉన్న 700 ఉద్యోగాల నియామకానికి సంబంధించి చర్యలు చేపట్టామని రాష్ట్ర అదనపు ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి (మానవ వనరులు, వన్య ప్రాణులు) డాక్టర్ శాంతిప్రియ పాండే తెలిపారు. ఈ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఎస్సీ కేటగిరి, క్రీడా కోటాల వివరాలతో ఏపీ పీఎస్సీకి రాశామని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీలో బుధవారం తనను కలసిన విలేకరులతో ఆమె మాట్లాడారు. రాష్ట్ర విభజన అనంతరం మన రాష్ట్రానికి దివాన్‌చెరువు వద్ద అటవీ అకాడమీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ అకాడమీలో ఎఫ్‌బీవోలు, ఎఫ్ఎస్‌వోలకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందని చెప్పారు. అటవీశాఖలో ఇంకా 400 మంది ఉద్యోగులు శిక్షణ పొందవలసి ఉందన్నారు. దివాన్‌చెరువు వద్ద అటవీ అకాడమీ నూతన భవనానికి శంకుస్థాపన జరిగిందని, ఆ పనులను సీపీడబ్ల్యూడికి అప్పగించనున్నామని చెప్పారు. ఆరు నెలల్లో నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

వధువు కావలెను

37 సం॥గల డైవర్స్ బిజినెస్ వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు లేదా చేదోడుగా ఉండానికి కావలెను. పిల్లలు వున్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు, నో డౌరీ సెల్: 6301943220, 8008440189
AJD:244766

WANTED

శ్రీనివాసా మల్టీస్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్, జవహర్ వీధి, కాకినాడలో పని చేయుటకు డెంటల్ అసిస్టెంట్ కావలెను. 10th పాస్, శాలరీ రూ.8000/- సెల్: 0884-2342346, 9290019948
AJD:244765

WANTED

▸▸ విజయవాడ, మొగలరాజపురం నందు 24 గం.లు ఇంటిలో వంట పని మరియు ఇంటి పని చేయుటకు ఆడ మనిషి కావలెను. ఆసక్తికరమైన జీతం ఇవ్వబడును. సంప్రదించండి: సెల్: 83417 15255, 79974 43771
AJB-235377

4 Lines CLASSIFIED Rs.230/- Only



రాజమండ్రి : సూర్యప్యాలెస్	పెద్దాపురం : వీరభద్ర
కాకినాడ : తిరుమల	తాటిపాక : శ్రీలక్ష్మీ
కాకినాడ : ఆనంద్ సినిమాస్	జగ్గంపేట : శ్రీరాజవేణి
కాకినాడ : దేవి సినిమాస్	రావులపాలెం : అక్షరకాంప్లెక్స్
కాకినాడ : PVR INOX	రామచంద్రపురం : సూర్య సినిమాక్స్
అమలాపురం : వెంకటరమణ	యానం : వీరేశ్వర
మండపేట : విజయమహల్	కొత్తపేట : ఆర్.ఎస్.సినిమాస్
పిఠాపురం : సత్య	ద్రాక్షారామం : శ్రీలక్ష్మీ

రాజమండ్రి : శ్యామల	గొల్లప్రోలు : శ్రీగోవింద మహల్
రాజమండ్రి : అశోక	రాజోలు : ఫోర్‌షోస్ కాంప్లెక్స్
కాకినాడ : ఆనంద్ సినిమాస్	సీతానగరం : గీతా బాలాజీ
కాకినాడ : దేవి సినిమాస్	కిర్లంపూడి : సూర్యరమ కాంప్లెక్స్
కాకినాడ : లక్ష్మీ	లక్కవరం : వేణుగోపాలకాంప్లెక్స్
కాకినాడ : PVR INOX	కత్తిపూడి : సత్యనారాయణ
అమలాపురం : వి.యల్.రమ	అంగర : భీమేశ్వర
మండపేట : రాజారత్న కాంప్లెక్స్	ఉప్పాడ : శ్రీనివాస
పిఠాపురం : పూర్ణ	కాకరపల్లి : శ్రీలక్ష్మీ
పెద్దాపురం : శ్రీలలిత కాంప్లెక్స్	రంపచోడవరం : లలిత
జగ్గంపేట : JVR కాంప్లెక్స్	రాజబొమ్మంగి : వెంకటేశ్వర
ఏలేశ్వరం : జయశ్రీ	డి.గన్నవరం : బాల బాలాజీ
తాటిపాక : శ్రీనివాస	బెండమూరులంక : వెంకటలక్ష్మీ చిత్రాలయ
సామర్లకోట : విఘ్నేశ్వర	కాట్రేనికోన : పరమేశ్వర
తుని : శ్రీరామ	జి. కొత్తపల్లి : శ్రీగోపికృష్ణ సినీప్లెక్స్
రావులపాలెం : వెంకటేశ్వర	రౌతులపూడి : మహాలక్ష్మీ
రామచంద్రపురం : సూర్య సినిమాక్స్	చింతూరు : ఓమ్ నవయుగ
మలికిపురం : పద్మజ కాంప్లెక్స్	కోరుకొండ : రామకృష్ణ
కొత్తపేట : సత్యచంద్ర	
యానం : పద్మ పి.ప్యాలెస్	
ద్రాక్షారామం : సూర్యసినీమ్యాక్స్	
నామవరం : వి.యస్.మహల్	
ధవళేశ్వరం : మురళీకృష్ణ	
గోకవరం : శ్రీనివాస	
రాయవరం : రాయల్ టాకీస్	
అనపర్తి : సూర్యశ్రీ	
రాజానగరం : ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్	
అన్నవరం : ఎస్.వి.ఆర్.మల్టీప్లెక్స్	
ముమ్మిడివరం : వెంకటేశ్వర	

రేపే విడుదల



రాజమహేంద్రవరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధే ధ్యేయం

● ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాజానగరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే తమ ధ్యేయమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏర్పాటుచేసిన నియోజకవర్గ విజన్ కార్యాచరణ అభివృద్ధి ప్రణాళికపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు, మూడు మండల కేంద్రాల్లోనూ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు, బూరుగుపూడి-గాడాల రహదారిలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు, నియోజకవర్గస్థాయిలో బ్లడ్ బ్యాంక్, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటును విజన్ డాక్యుమెంట్‌లో పొందుపర్చాలని అధికారులకు సూచించారు. అలాగే నియోజకవర్గ ప్రజలకు గోదావరి జలాల తాగు, సాగునీటి సరఫరా చేసేందుకు విజన్ డాక్యుమెంట్ లో పొందుపర్చారు. పామాయిల్, రైస్ రిసెర్చ్ సెంటర్లు ఏర్పాటు, పంచాయతీ రాజ్ లింక్ రోడ్లు వేసేందుకు రూ.180కోట్లతో అంచనాలతో ప్రతిపాదనలు నివేదన, ములకల్లంకను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాల్సింగా ప్రతిపాదించారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా ప్రభుత్వం సూచించిన పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం మానవ వనరుల అభివృద్ధి, నీటి వనరుల పరిరక్షణ, ఫార్మర్ అండ్ అగ్రిటెక్, గ్లోబల్ బెస్ట్ లాజిస్టిక్స్ కాస్ట్ ఆప్టిమైజేషన్, విద్యుత్ ఇంధన రంగాల్లో ధరల నియంత్రణ, ప్రొడక్ట్ పర్ఫెక్షన్, స్వచ్ఛాంధ్రలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నియో జకవర్గ పరిధిలోని సీతానగరం, రాజానగరం, కోరుకొండ మండలాలకు చెందిన వివిధ శాఖలకు చెందిన అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో
రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

● జిల్లా వ్యవసాయశాఖాధికారి మాధవరావు

అనపర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైతులు కాలనుగుణంగా వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ సాంకేతికతను అదిపుచ్చుకుని అదిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ శాఖాదికారి ఎస్.మాధవరావు అన్నారు. బుధవారం మండం లోని పులగుర్త గ్రామంలో అనపర్తి ఏవో సురేష్ అధ్యక్షతన జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సుమారు 90శాతం ఊడ్పులు పూ ర్తయ్యాయని నెలాఖరులోపున పూర్తిస్థాయిలో పూర్తి చేసుకోవాలని అన్నారు. అదే విదంగా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ హనుమకొండ శ్రీనివాస్, ఏడిఏ ఎస్ జయరామలక్ష్మి, కూటమి నాయకులు జాస్తి రామచంద్రరావు, గొడితి వెంకటకృష్ణ, బలుసు నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో సమావేశమైన జిల్లా వ్యవసాయశాఖాధికారి మాధవరావు

పాఠశాలల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకం

● సీమేట్ రాష్ట్ర పరిశీలకుడు ప్రసాద్



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు ప్రసాద్

రాజానగరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని రాష్ట్ర పరిశీలకులు, సీమేట్ ప్రొఫెసర్ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని మల్లంపూడి శ్రీసాయి మాధవీ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న స్కూల్ లీడర్‌షిప్ డవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా మూడోరోజు బుధవారం శిక్షణా తరగతులను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ర్థుల అభ్యసనా సామర్థ్యాలు, పాఠశాల ఎన్‌రోల్ మెంట్ పెంపొందించి తద్వారా పాఠశాల అభివృద్ధిని సాధించేందుకు ప్రతి ప్రధానోపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. అలాగే పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల పరిరక్షణలోనూ, ఆర్థిక వనరుల వినియోగంలోనూ ప్రధానోపాధ్యాయులు జాగరూకతతో ఉండాలని సూచించారు. శిక్షణా తరగతుల నిర్వహణ తీరును, తరగతి గదుల్లో కల్పించిన వసతులపట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంఓ గౌరీశంకర్, కౌవల్య ప్రతినిధి శైలజ, అనపర్తి మండల విద్యాశాఖాధికారి సత్తిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ చైర్మన్‌గా తుపాకుల



తుపాకుల వెంకన్నబాబు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ యాంటి కరప్షన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా తుపాకుల వెంకన్నబాబు నియమితులయ్యారు. ఈమేరకు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండా రెడ్డి మల్లిఖార్జునరెడ్డి నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఈసందర్భంగా తుపాకుల వెంకన్నబాబు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో తనకు జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహింస్తానన్నారు.

గత మూడు రోజులుగా పేపరుమిల్లు ఎదురుగా జక్కంపూడి

● నేడు కార్మిక సమస్యలకు పరిష్కారం రాకపోతే దీక్ష

రాజమహేంద్రవరం సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు కార్మికులకు న్యాయం చేయాలని లేకుంటే ఆమరణ దీక్ష చేస్తానని ప్రకటించిన రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గత మూడు రోజులుగా పేపరుమిల్లు ఎదురుగా ఉన్న కళ్యాణ మండపంలో వెయిటింగ్‌లో ఉన్నారు. ఆయన ముందుగా ప్రకటించిన మేరకు మంత్రి దుర్గేష్ ఇచ్చిన హామీ మేరకు ఈనెల 17వ తేదీ సాయంత్రంలోపు సీఎం కార్యాలయం అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో కార్మికులకు న్యాయం జరగాలని లేనిపక్షంలో తాను ప్రత్యక్ష ఆందోళన చేస్తానని ఆమరణ దీక్ష చేస్తానని జక్కంపూడి రాజా ప్రకటించారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా
కూటమి ప్రభుత్వ పాలన

● సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేలు



రాజమహేంద్రవరంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు



కడియపులంకలో పూలదండలు తయారు చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, జూలై 16(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు అమలు, అభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన సాగుతోందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. బుధవారం కడియపులంక, వెంకయ్యపేట గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల గ్రామంలో పలు ప్రాంతాలను సందర్శించారు. సంక్షేమ పథకాలు అమలు ఎలాఉంది, పథకాలు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాలను అడిగారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీని అమలు చేస్తున్నామని సీఎంచంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కూటమి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. వెంకయ్యమ్మపేటలో అంగన్‌వాడీ కేంద్రంకు ప్రభుత్వం సమకూర్చిన ఎల్‌ఈడీ టీవీ, వాటర్‌ప్యూరిఫైర్, ప్లే మెటీరియల్‌ను ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంబించారు. చిన్నారులకు పుస్తకా లు అందజేశారు. గర్భిణులకు సీమంతాలు చేసి పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీ, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ రాష్ట్ర నాయకులు మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చం టి, ఏఎంసీ ఉపాధ్యక్షులు బోడపాటి గోపి, త్రిమేన్‌కమిటీ కడియం, కడియపులంక, మురమండ చైర్‌పర్సన్‌లు వెలుగుబంటినాని, గట్టి నర్సయ్య, వట్టికూటి దత్తుడు, కూటమి నాయకులు, ఐసీడీఎస్ పీడీ సీహెచ్ లక్ష్మి, ఏసీడీపీవో కనకవల్లి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ఏ ఒక్క అర్హుడికీ అన్యాయం జరగదు : ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ: కూటమి పాలనలో ఏఒక్క అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల విషయంలో అన్యాయం జరగదని రాజమహేంద్రవరం ఎమ్మె ల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక 13,14 డివిజన్లలో బుధవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పథకాల అమలుతీరుపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకుని టీడీపీ యాప్‌లో పొందుపరిచారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పాలనలో ప్రజలు సురక్షితంగా ఉన్నారన్నారు. అనంతరం ప్రజల నుంచి వస్తున్న స్థానిక సమస్యలపై ఆదిరెడ్డి స్పందించి కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని పుష్కరాల నాటికి నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, మాజీ కార్పొరేటర్ మొకమాటి సత్యనారాయణ, రాచపల్లి ప్రసాద్, కప్పల వెలుగుకుమారి, బొర్రా చిన్ని, బుడ్డిగ రవి, నగరబోయిన రామకృష్ణ, రాయి అప్పన్నబాబు, ఈతలపాటి రవి, కృష్ణ, చెల్లుబోయిన సూర్యనారాయణ మూర్తి, ప్రతాప్ పాల్గొన్నారు.



పీరా రామచంద్రపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మనోజ్‌రెడ్డి

సుపరిపాలన సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

అనపర్తి: సుపరిపాలన అందించడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికే సాధ్యమని కూటమి ఏడాదిపాలనలో అది రుజువైందని అనపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అన్నారు. బుధవారం అనపర్తి మండలం పీరా రామచంద్రపురంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆయన కూటమి నాయకులతో కలిసి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కర్రి బులిరెడ్డి, ఎస్ఆర్‌కె ప్రసాదరెడ్డి, ద్వారంపూడి తాతారెడ్డి, సర్పంచ్ తేతల సుధాకరరెడ్డి, కర్రి శేషారత్నం, సుభాషిణి, సిరసపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని నల్లమిల్లి గ్రామంలో అనపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ నల్లమిల్లి మనోజ్‌రెడ్డి ఈఏడాది కాలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవిందు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, జనసేన మండల అధ్యక్షుడు గిరజాల సత్తిబాబు, అడబాల వెంకట్రావు, కడిమి సాయిబాబు, గుత్తుల సుబ్రహ్మణ్యం, యడ్లగణేష్, వట్టికూటి వెంకన్నబాబు. ఉద్దండ్రావు శ్రీను, కొమ్మన రాంబాబు, గారపాటి రాంబాబు, పోతుల చిన్నికాపు, చింతపూడి పోతురాజు, గోవిందు పాల్గొన్నారు.

24 గంటల్లో వీధిలైట్లకు మోక్షం

బిక్కవోలు: తుమ్మలపల్లిలో బుధవారం అన్ని వీధుల్లోను పంచాయతీ సిబ్బంది వీధిలైట్లను ఏర్పాటు చేశారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో గ్రామస్థులు వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నామని టీడీపీ నియోజకవర్గ ఇన్ చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదే శాల మేరకు 24 గంటల్లో పంచాయతీ సిబ్బంది వీధిలైట్లను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్థులు మనోజ్‌రెడ్డికి, పంచాయతీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడిని కలిసిన దళిత నేతలు



జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచంద్రన్‌ను గజమాలతో సత్కరిస్తున్న గడ్డు రాజేష్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రన్, ఎస్సీ కమిషన్ సౌత్ ఇండియా డైరెక్టర్ గెడ్డం సునీల్ కుమార్‌బాబు రాజమహేంద్రవరం పర్యటనకు వచ్చారు. స్థానిక మంజీరాలో జిల్లా వ్యాప్తంగా ఉన్న దళిత నాయకులు, ఎస్సీ ఉద్యోగసంఘం నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు గుడ్ల రాజేష్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ ఉద్యోగుల సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ కుంచే యశ్వంత్, ఎస్సీ ఉద్యోగుల సంఘం నాయకులు తాళ్ళూరి బాబూ రాజేంద్రప్రసాద్‌లు మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి రాంబాబు, దళిత నాయకులు కోరుకొండ చిరంజీవీ, సన్నీ నాని, దాసరి నాగరాజు, అమలాపురం రాజేష్‌లు కలిశారు. రాజేష్ బృందం గజమాలతో సత్కరించారు. తొలుత బ్యాంకర్లు, ఇతర జిల్లాలకు చెందిన వివిధశాఖల అధికారుతో వారు సమీక్ష నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి జరుగుతున్న జాప్యం, బ్యాంకర్ల వ్యవహరిస్తున్న తీరుతెన్నులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదులో జరుగుతున్న నిర్లక్ష్యం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం స్టేట్ బ్యాంక్ ఇండియా ఎస్సీ ఉద్యోగుల సంఘం నేత కుంచే యశ్వంత్ వారిని కలిసి అతి త్వరలో రాజమహేంద్రవరంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాలు కలిపి ఒక జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేస్తామని వారితో చెప్పారు ఉమ్మడితూర్పుగోదావరి జిల్లాల రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేస్తే సమస్యలు వెలుగులోకి వస్తాయని గుడ్ల రాజేష్ కమిషన్ సభ్యులను కోరారు.

సీఎం చంద్రబాబును కలిసిన అభిరామ్



ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన అభిరామ్

రాజానగరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం నారా చంద్ర బాబునాయుడిని ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ తనయుడు అభిరామ్ ఢిల్లీలో చంద్ర బాబుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు అభిరామ్‌ను భుజంతట్టి చిరునవ్వుతో స్వాగతిస్తూ ముందుకు సాగారు.

హెల్మెట్ ధరించాల్సిందే

● ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని ఎస్పీ నరసింహకిషోర్ పేర్కొన్నారు. పలు సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో హెల్మెట్ పట్టణ, నగర ప్రాంతాల్లో అవసరంలేదని వస్తున్న పోస్టులు వదంతులని, వాటిని నమ్మవద్దని ఆయన పేర్కొన్నారు. వాహన చోదకులు ఖచ్చితంగా హెల్మెట్ పెట్టుకోవాలని, లేనిపక్షంలో కొత్త మోటార్ వెహికల్ చట్ట ప్రకారం జరిమానాకు బాధ్యులవుతారని ఆ యన హెచ్చరించారు. రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలన్నారు. ఈ అంశాలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు విస్తృతంగా అవ గాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు.

మంత్రిని కలిసిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు



కడియం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ఆసంఘం నేతృత్వంలో బుధవారం ఉండవల్లిలో రాష్ట్ర మానవ వనరులు, సాంకేతిక విజ్ఞానశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. వివిధ రాష్ట్రాల్లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు అమలవుతున్న ప్రోత్సాహకాలు గురించి వివరించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు మన రాష్ట్రంలో ఎటువంటి ప్రోత్సాహకాలు అమలు కావడంలేదని మంత్రి లోకేష్‌కు చెప్పారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారులతో చర్చించి తాము నిర్ణయం తీసుకుంటామని సానుకూలంగా స్పందించినట్లు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ రాష్ట్రసంఘం గౌరవాధ్యక్షుడు చిలుకూరి శ్రీనివాసరావు తెలిపారు. మంత్రి లోకేష్‌ను కలిసిన వారిలో ఎర్రా ఎస్ ఎస్‌వీఎస్ చక్రవర్తి, కొణితాల ఫణిభూషణ్‌శ్రీధర్, గోరంట్ల శ్రీనివాస్, కైతేపల్లి దాస్ ఉన్నారు.

పాఠశాల పిల్లలకు బూస్టర్ డోసులు వేయాలి

● సెంట్రల్ జోన్ ఐఏపీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గురు ప్రసాద్



రాజమహేంద్రవరంసిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): పాఠశాల వయస్సు పిల్లలకు బూస్టర్ డోసులు వేయడం ద్వారా నాలుగు తీవ్రమైన వ్యాధుల నుంచి రక్షణ అందించవచ్చని నిపుణులు సూచిస్తున్నారని సెంట్రల్‌జోన్ ఐఏపీవైస్ ప్రెసిడెంట్, శ్రీహిత డాక్టర్ వైఎస్ గురుప్రసాద్ అన్నారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టీకా ద్వారా నివారించగల వ్యాధుల నుంచి పిల్లలను రక్షించడానికి భారతదేశం చేస్తున్న ప్రయత్నాల నడుమ పాఠశాల ప్రవేశ వయస్సులో పిల్లలకు డిఫ్తీరియా, ధనుర్వాతం, కోరింత దగ్గు, పోలియోకు వ్యతిరేకంగా బూస్టర్ డోస్‌లు సకాలంలో అందించాలన్నారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధునిక కాంబినేషన్ వ్యాక్సిన్ల వాడకాన్ని సిఫార్సు చేస్తుందని ఇవి ఒక మోతాదుతో బహుళ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ అందిస్తాయన్నారు. మీ బిడ్డల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంలో తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధ వహించాలని మెరుగైన ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కావాలన్నారు. సం దేహాలు ఎమైనావుంటే తనను సంప్రదించవచ్చని తెలిపారు.

రాజమహేంద్రవరానికి
స్టేడియం, క్రీడా సదుపాయలు

● ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి త్వరలో పూర్తిస్థాయిలో స్టేడియం, క్రీడా సదుపాయాలు సమకూరుతున్నాయని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. రాజమహేంద్రవరం జిల్లా పోలీస్ గ్రౌండ్స్‌లో భారత్ రైసింగ్ ఫౌండేషన్, జైకిషన్ (జెకె) ఆధ్వర్యంలో జరుతున్న మాస్టర్ కప్ టోర్నీ క్రికెట్ (40ఏళ్ల కేటగిరి)మ్యాచ్‌ల రెండోరోజు ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్యఅతిథిగా హాజరై బ్యాటింగ్ చేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 40ఏళ్ల దాటిన వారిని ప్రోత్సహించేందుకే పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జైకిషన్, మిథున్‌వర్మ, మూర్తిచౌదరి, చల్లా బాలమురళీ, అడబాల రామకృష్ణ, చైతన్య, పిల్లి గంగరాజు, కాలేపు సత్యనారాయణ, కళ్యాణ్ , నాగార్జున, రమేష్, ఉమాదేవి పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్ లో బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్సీ సోము

సచివాలయ ఉద్యోగులకు సత్కారం



కొంకుదురులో బదిలీపై వెళుతున్న సిబ్బందిని సత్కరిస్తున్న గ్రామస్థులు

బిక్కవోలు, జూలై 16(ఆంధ్రజ్యోతి): కొంకుదురు 1, 2 సచివాలయాల నుంచి బదిలీ అయిన 9 మంది సిబ్బందిని బుధవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు బదిలీ అయిన వారిలో ఎన్.సాయిప్రసాద్, పీవీపీఎస్.నాగేశ్వరరావు, కె. తాతయ్య, ఎస్.శ్యామల, జి.సుధారాణి, జి.పద్మ, డి.రాజు, ఆర్.ఉమామహేశ్వరి, ఎం.దుర్గాప్రసాద్‌రావు ఉన్నారు. సర్పంచ్ సత్తి వీరమణి, జెడ్‌పీటీసీ రొంగల పద్మావతి, ఎంపీటీసీ పీవీ, టీడీపీమండల అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ....

కొంకుదురు ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఎస్‌వీవీ ప్రసాద్, టి.జయకృష్ణారెడ్డి, వి.శ్రీనివాసులరెడ్డి, ఎస్. వెంకట్రావు, దాక్షాయనిలను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, సత్తిరాజు, పీడీ యువరాజారెడ్డి, వీర సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరం

● ఏఎస్పీ సుబ్బరాజు

దివాన్‌చెరువు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్, రహదారి, మహిళాభద్రతలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం ఏఎస్పీ ఏ.వి.సుబ్బరాజు అన్నారు. రాజానగరం మండలం నామవరంలోని భారతీయ విద్యాభవన్స్‌లో బుధవారం జరిగిన విద్యార్థి నాయకుల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సమాజంలో పోలీసుల బాధ్యతలను వివరించారు. అనంతరం ఆయనను భవన్స్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భవన్స్ ప్రాంతీయ విద్యాధికారి జె.ఎస్.ఎన్.మూర్తి, ప్రిన్సిపాల్ సూర్యన్ పాల్గొన్నారు.

ప్రజాసేవకు నిలువుటద్దం మాజీ ఎమ్మెల్యే అమ్మిరెడ్డి

● వర్ధంతి సభలో కూటమి నాయకులు



అనపర్తిలో మాజీ ఎమ్మెల్యే అమ్మిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు, కళాశాల సిబ్బంది


అనపర్తి, జూలై 16(ఆంధ్రజ్యోతి): అనపర్తి ఎమ్మెల్యేగా సేవలందించిన పడాల అమ్మిరెడ్డి ప్రజాసేవకు నిలువుటద్దంగా నిలిచారని నేటితరం నాయకులు అమ్మిరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని అనపర్తి నియోజకవర్గ కూటమి నాయకులుఅన్నారు. మాజీ ఎమ్మెల్యే పడాల అమ్మిరెడ్డి 39వ వర్ధంతి సందర్భంగా బుధవారం అనపర్తిలోని జీబీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ జెడ్‌పీటీసీ పడాల రాములు అమ్మిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1978లో ఎమ్మెల్యేగా గెలుపొందిన అమ్మిరెడ్డి, గొలుగూరి బాపిరాజుతో కలిసి మహిళా విద్య ప్రాధాన్యతను గుర్తించి అనపర్తిలో కళాశాల ఏర్పాటుకు కృషిచేశారని అన్నారు. అమ్మి రెడ్డి తనయుడు పడాల రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సత్తి రామారెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, టి.సుబ్బిరామిరెడ్డి, నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీ అబ్బాయిరెడ్డి, రత్నారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పీఆర్ఎల్ స్వామి, కూటమి నాయకులు, కార్యకర్తలు, అమ్మిరెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

మోడల్ ప్రైమరీ పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో

బిక్కవోలు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రంగాపురం గ్రామంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలను బుధవారం ఎంపీడీవో వి. శ్రీనివాస్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన పిల్లల నమోదుగురించి హెచ్ఎం రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నభోజనాన్ని తనిఖీచేసి విద్యార్థులను ప్రశ్నించగా సన్న బియ్యం వచ్చాక భోజనం బాగుందనడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయన వెంట రంగాపురం ప్రత్యేకాధికారి శామ్యూల్ జాన్ ఉన్నారు.

రంగాపురంలో ప్రాథమికోన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలి

బిక్కవోలు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రంగాపురంలో ప్రాథమికోన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కేంద్ర బృంద సభ్యులను కోరారు. గ్రామంలో బుధవారం నేషనల్ లెవెల్ మానిటరింగ్ సభ్యులు వినోద్, నాగరాజు పర్యటించారు. కేంద్రం నిధులతో అమలవుతున్న పలు పథకాలను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలో ఏర్పాటుచేసిన సభలో ఉపాధి కూలీల జాబ్‌కార్డులను పరిశీలించి, జమవుతున్న వేతన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని సమస్యలు తెలుపమనగా గతంలో ప్రాథమికోన్నత పాఠశాల వుండేదని, ఆపై 6, 7 తరగతులు ఇళ్లపల్లి ఉన్నత పాఠశాలలో కలిపేశారని, దీంతో చదువు మధ్యలోమానేస్తున్నారని, యూపీ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరగా అందుకు కేంద్ర బృందం పభుత్వాలకు నివేదిస్తామని హామీ ఇచ్చారు.







ఎండ పాట్లు

బాబోయ్.. ఇవేం ఎండలు!

- ఉక్కపోత, వేడి వాతావరణం
- వేడిగాలులతో ఉక్కిరిబిక్కిరి
- వర్షాకాలంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యం
- కొందరికి అనారోగ్య పరిస్థితులు



కాకినాడ నగరంలో ఎండ తీవ్రత కారణంగా గొడుగు వేసుకుని వెళుతున్న యువతులు

ఇది వర్షాకాలమా! మండు వేసవిలో ఉన్నామా! ప్రస్తుత వాతావరణం పరిస్థితి చూస్తే అందరికీ అదే అనుమానం కలుగుతోంది. వర్షాలు కురవాల్సిన సమయంలో వేసవిని తలపించే రీతిలో కాస్తున్న ఎండలు, వీస్తున్న వేడిగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

పిఠాపురం/ రాజమహేంద్రవరం సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడి అందరూ సేదతీరారు. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత అప్పుడప్పుడు పడిన వర్షాలు, రుతు పవనాల ప్రభావం అంతంతమాత్రంగానే ఉండి ఎండలు తీవ్రంగా కాస్తుండడంతో ఇప్పుడు వేసవికాలం అన్నట్టుగా మారిపోయింది వాతావరణం. గత నాలుగైదు రోజులుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా గరిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటలకే వేడిగాలులు ప్రారంభమై, సాయంత్రం వరకు కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు రోడ్లపైకి వచ్చేందుకు సాహసించట్లేదు. మధ్యాహ్నం పూట రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. బైక్‌లపై కూడా బయట తిరగలేని పరిస్థితి. టోపీలు పెట్టుకున్నా, కూలింగ్ గ్లాస్‌లు ధరించినా మాస్క్‌లు పెట్టుకున్నా సరే ఎండదెబ్బకు హడలిపోయారు. ఉపశమనం కోసం శీతలపానీయాలు వైపు పరుగులు పెడుతున్నారు. ఈ వాతావరణంతో మరోపక్క తలపోటు, జ్వరాలు వచ్చి జనం ఇబ్బందులు పడుతున్నారు. అటు సాయంత్రం నుంచి రాత్రి వరకు ఒకటే ఉక్కపోత. ఆపై వేడి తగ్గకపోవడంతో వృద్ధులు, చిన్నారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. పిఠాపురం, కాకినాడ, తుని, పెద్దాపురం, సామర్లకోట, గొల్లప్రోలు, ఏలేశ్వరం, జగ్గంపేట తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 37-39 డిగ్రీల మధ్య ఉంటున్నాయి. అమలాపురం, రాజమహేంద్రవరంలలో కూడా ఇదే పరిస్థితి. అయితే 41-43 డిగ్రీలు ఉన్న ఫీలింగ్ ఉంటుందని వాతావరణశాఖ చెప్తోంది. రుతుపవనాల ప్రభావం అంతగా లేకపోవడం, బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో వేడిగాలులు వీస్తున్నట్టు చెప్తున్నారు. బుధవారం ఇదే పరిస్థితి ఉండగా, గురువారం నుంచి అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ చెప్పడం ఒక్కటే కొంత ఉపశమనంగా ఉంది.

'నీరి' తేరేనా..



గోదావరి కాల్వలోకి చెత్త డంపింగ్ (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో కాలుష్య కాసారాలుగా మారిపోయిన గోదావరి కాలువలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ఎక్కడికక్కడ కోళ్లు, రొయ్యలతోపాటు నివాస, వాణిజ్య, పారిశ్రామిక వ్యర్థాలన్నీ యథేచ్ఛగా కాలువల్లో కలిసిపోవడంతో అన్నదాతలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఈనేపథ్యంలో సమస్య పరిష్కరించడానికి రంగంలోకి దిగింది. కాలువలు ఎక్కడెక్కడ ఏవిధంగా కాలుష్యం అవుతున్నాయో గుర్తించాలని నిర్ణయించింది. ఈమేరకు సమగ్రంగా అధ్యయనం చేయించేందుకు సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (నీరి)కి బాధ్యతలు అప్పగించింది. త్వరలో ఈ సంస్థ నిపుణులు గోదావరి కాలువలపై అధ్యయనం చేయనున్నారు.

- ఉమ్మడి జిల్లాలో గోదావరి పంట కాలువల కాలుష్యంపై ప్రభుత్వం దృష్టి
- కాలువల నిండా తీవ్రంగా వ్యర్థాలు పెరగడంతో అన్నదాతల ఇబ్బందులు
- వందలాది గ్రామాల్లోని ప్రజల తాగునీటి అవసరాలకు ఈ నీళ్లే దిక్కు
- సమస్య మూలాలపై అధ్యయన బాధ్యతలు కేంద్ర ప్రభుత్వం సంస్థకు అప్పగింత
- గోదావరి కాలువల్లో ఇనిస్టిట్యూట్ నిపుణుల అధ్యయనం : 4 నెలల్లో నివేదిక
- అటు కాలువల్లో కోళ్లు, రొయ్యలు తదితర వ్యర్థాలన్నీ యథేచ్ఛగా పారబోత
- అనేక పరిశ్రమల వృథా కాలుష్య జలాలూ కాలువల్లోకే మళ్లింపు
- 'మిషన్ క్లీన్ గోదావరి' అంటూ వైసీపీ ప్రభుత్వం హడావుడి.. పనులు నిల్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి ప్రధాన కాలువలు తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో 2,400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. మధ్య డెల్టా కింద కోనసీమ, తూర్పు డెల్టా కింద ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు కాలువలు, డ్రైన్ల ద్వారా గోదావరి నీరు ప్రవహిస్తోంది. ఈ నీళ్లు లక్షల ఎకరాల పంటసాగుతోపాటు తాగునీటికి కూడా ఆధారం. ఈ నేపథ్యంలో వీటిని ఎక్కడికక్కడ సురక్షితంగా ఉంచితేనే ఆ నీళ్లు తాగే ప్రజల ఆరోగ్యానికి ధీమా. కానీ దీనికి విరుద్ధంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గోదావరి కాలువలు కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. అనేకమంది ఇళ్లల్లో ఉండే చెత్తాచెదారం అంతా తెచ్చి ఈ కాలువల్లోనే పారబోస్తున్నారు.



అనపర్తిలో గోదావరి కాల్వ వెంబడి చెత్త

గృహనిర్మాణ వ్యర్థాలు, చికెన్, చేపలు, రొయ్యల వ్యర్థాలు, మద్యం దుకాణాల మొదలు క్షవరశాలలు, వందలాది వాణిజ్య దుకాణాల్లో వాడిపడేసిన వస్తువులను కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఇది కాకుండా కడియం నుంచి కాకినాడ వరకు, ఆత్రేయపురం నుంచి అమలాపురం వరకు కాలువలకు సమీపంలో వందలాది కోళ్లఫారాలున్నాయి. వీటిల్లోని వందల టన్నుల వ్యర్థాలను డ్రమ్ముల్లో తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా అనపర్తి, కడియం, బిక్కవోలు, ద్వారపూడి, సామర్లకోట, కాకినాడ, కోనసీమ పరిధిలోని కాలువల్లో ఈ తరహా వ్యర్థాలు భయంకరంగా కలిపేస్తున్నారు. కోనసీమ పరిధిలో రొయ్యల చెరువుల్లో వాడిన నీటిని పైపులతో గోదావరి కాలువలకు మళ్లిస్తున్నారు. అటు తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని నిడదవోలు, కొవ్వూరు తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. ఇందులో అనేకరకాల హానికారక రసాయనాలు కలిసి ఉంటాయని తెలిసినా లెక్కచేయడం లేదు. ఇలా ఎక్కడికక్కడ కాలువలు విషమయం అవుతుండగా, ఆ నీటిని తాగే మూగజీవాలు తరచూ మృత్యువాత పడుతున్నాయి. అలాగే పంచాయతీల పరిధిలోని మురుగుకాలువల నీటినీ కాలువల్లోకే తరలిస్తున్నారు. అలాగే రాజమహేంద్రవరం నుంచి సామర్లకోట వరకు కాలువలకు సమీపంలో అనేక రకాల పరిశ్రమలున్నాయి. వీటిలో వినియోగించగా వచ్చే కాలుష్య జలాలను శుద్ధిచేసి భూమిలోకి వెళ్లేలా చేయాలి. కానీ ఖర్చు సాకుతో గుట్టుగా పైపుల్లోంచి గోదావరి కాలువల్లోకి కలిపేస్తున్నారు. ఈనేపథ్యంలో గత వైసీపీ సర్కారు 'మిషన్ క్లీన్ గోదావరి' పేరుతో ప్రత్యేక ప్రాజెక్టును 2019 సెప్టెంబరులో ప్రారంభించింది. సీఎం చైర్మన్‌గా వ్యవహరించే ప్రాజెక్టు కింద రూ.100 కోట్లతో పనులు చేస్తామని గొప్పలు చెప్పింది. తీరా అయిదేళ్లలో కాలుష్య నివారణకు పైసా ఖర్చు చేయలేదు. ఈ నేపథ్యంలో తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో 175 చోట్ల గోదావరి కాలువల్లో నీళ్లు విషతుల్యంగా మారినట్టు నీటిపారుదలశాఖ రెండేళ్ల కిందట గుర్తించింది. కాలువల వెంబడి వ్యర్థాలపై డ్రోన్లతో పంచాయతీలు, మున్సిపాల్టీలు సర్వే చేసింది. అత్యధికంగా కోనసీమలో కోళ్లు, రొయ్యల వ్యర్థాలు, కడియం, ద్వారపూడి, అనపర్తి, బిక్కవోలు, సామర్లకోట పరిధిలో 68 చోట్ల కాలువలు నీళ్లు వ్యర్థాలతో విషపూరితంగా మారినట్టు నిర్ధారించారు. కొన్నిచోట్ల పరిశ్రమల నుంచి కాలుష్య జలాలు నేరుగా కలిసిపోతున్నట్టు తేల్చారు. ఇవన్నీ పంటపొలాలకు చేరడంతో పంటలు నష్టపోవడం, అటు భూగర్భ జలాలు సైతం కలుషితం అయినట్టు ఆయాశాఖలు తేల్చాయి. కానీ అప్పటి ప్రభుత్వం పైసా కూడా ఇవ్వకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టిసారించింది. కాలువల్లో ఎక్కడెక్కడ కాలుష్యం కలుస్తోంది? ఆయా జల కాలుష్యంతో ఎంతెంత హానికర రసాయనాలున్నాయి? తద్వారా వచ్చే సమస్యలేంటి? అనే దానిపై అధ్యయనం చేయించాలని నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు చైర్మన్ కొన్ని రోజుల కిందట జిల్లాలో కాలువలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం చర్చించగా, సమగ్రంగా అధ్యయనం చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(నీరి)కి అప్పగించాలని నిర్ణయించారు. త్వరలో నీరి అధ్యయనం చేసి పరిష్కారం సూచిస్తూ నాలుగు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందించనుంది.

బలభద్రపురంపైనా..

బిక్కవోలు మండలం బలభద్రపురంలో క్యాన్సర్ కేసులు కలకలం రేపిన విషయం తెలిసిందే. గ్రామంలో 62 క్యాన్సర్ కేసులున్నట్టు కాకినాడ రంగరాయ వైద్య కళాశాల అధ్యయనంలో తేలింది. ఒకే తరహా కాకుండా పలు రకాల క్యాన్సర్ కేసులు ఇక్కడే రావడానికి ఏయే కాలుష్య కారకాలు కారణం అనేది అధ్యయనం చేసి తేల్చే బాధ్యతను ప్రభుత్వం 'నీరి'కి అప్పగించింది. ఇందుకు రూ.50లక్షల వరకు ఖర్చవుతుండగా, పీసీబీ తరఫున ఖర్చులు భరించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలో నిపుణులు అధ్యయనం ప్రారంభించనున్నారు. మరోవైపు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సైతం త్వరలో ఇక్కడ క్యాన్సర్ స్ర్కీనింగ్ చేపట్టనుంది.

ప్రజా పంపిణీ వ్యవస్థలో అవకతవకలు జరిగితే సహించేదిలేదు

డీఎస్‌వో వి.పార్వతి



కరగపాడులో స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్‌వో పార్వతి

గోపాలపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందాల్సిన నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి వి.పార్వతి అన్నారు. మండలంలోని కరగపాడు గ్రామంలోని షాపు నెంబర్.33 చౌక దుకాణాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో స్టాకుకు సేల్స్‌కు భారీ వ్యత్యాసం కనపడడంతో ఆమె అవాక్కయ్యారు. గతంలో ఇదే షాపుపై రెండుసార్లు తనిఖీలు చేయగా 1500కిలోల బియ్యం తేడా రావడంతో 6ఏ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. వాటితో కలిపి 2,920 కిలోల బియ్యం స్టాకు రికార్డు ప్రకారం దుకాణంలో ఉండాల్సి ఉండగా, కేవలం 100 కిలోల బియ్యం ఉన్నాయన్నారు. గతంలో 6ఏ కేసుకు సంబంధించి 15క్వింటాళ్ల బియ్యం కాగా మరో 1320కిలోల బియ్యం దుకాణంలో లేవన్నారు. దీనిపై కేసు నమోదు చేసి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామంలో పలువురు వినియోగదారులను దుకాణ నిర్వహణపై ఆరా తీయగా, బియ్యం సక్రమంగా ఇవ్వడంలేదని తెలపడంతో ఆమె నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 33వ నెంబర్ షాపు ఇన్‌ఛార్జ్‌ను తొలగించి స్వయం సహాయ సంఘాల మహిళల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఆమె వెంట సివిల్ సప్లై డీటీ దివాకర్, ఆర్ఐ సునీత, వీఆర్వో బొదియ్య ఉన్నారు.

సామాజిక తనిఖీలో భారీగా అక్రమాలు గుర్తింపు



చాగల్లులో జరిగిన ఎన్ఆర్‌జీఎస్ ప్రజావేదిక సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

చాగల్లు,జూలై16(ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరం జరిగిన జాతీయ ఉపాధిహామీ పనులపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి మాట్లాడుతూ సామాజిక భద్రత పెన్షన్‌లు లబ్ధిదారుల ఇంటి వద్దనే ప్రతి నెల సకాలంలో అందజేయాలని సూచించారు. మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో రూ.7.5 కోట్లు వ్యయంతో 971 పనులు జరిగాయి. వీటిలో రూ.53.61 లక్షలు మేర తేడాలు జరిగినట్టు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. ఈ విషయమై డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రూ.1.17 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. రూ.25 లక్షల విలువ చేసే పనులు తిరిగి చేయాలని ఆదేశించారు. మరొక రూ.16 లక్షలు విలువ చేసే పనులపై ఏపీడీ ఆధ్వర్యంలో విచారణ చేయించాలన్నారు. ఎస్ఆర్‌పీ బి.సూర్యచంద్ర విలేకరులతో మాట్లాడుతూ పంట కాలువలు లేనివి ఉన్నట్టుగా చూపించడం, కొలతల్లో భారీగా తేడాలు గుర్తించడం జరిగిందన్నారు. వర్క్ బోర్డులు ఏర్పాటుచేయకపోవడం, ఉపాధిహామీలో నాటిన మొక్కలు నిర్వహణ సక్రమంగా లేకపోవడం వంటి అనేక అవకతవకలు గుర్తించినట్టు చెప్పారు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకునే ఆశలు అంగన్‌వాడీ సిబ్బంది పెన్షన్‌లు తీసుకున్నట్టు గుర్తించారు. ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో కనీస వసతులు కూడా ఏర్పాటులేదని ఫిర్యాదులు అందినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్సు అధికారిణి రత్నకుమారి, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, ఏపీడీ బి.రామ్‌ప్రసాద్, అంబుడ్స్‌పర్సన్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

న్యాయవాదుల బైక్ ర్యాలీ

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): జూలై 10 నుంచి 16 వరకూ మీడియేషన్ ఫర్ ద నేషన్ (మధ్య వర్తిత్వం-దేశం కోసం) వారోత్సవాలను నిర్వహించారు. చివరి రోజయిన బుధవారం బైక్ ర్యాలీని నిర్వహించారు. దీనిని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి ప్రారంభించారు. వారోత్సవాల్లో భాగంగా మధ్య వర్తిత్వంపై విస్తృతంగా అవగాహన కల్పించామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, శిక్షణ తీసుకున్న న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బాలస్వాస్థ్యలో విద్యార్థులు, అంగన్వాడీ పిల్లలకు వైద్యపరీక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పాఠశాలల విద్యార్థులు, అంగన్వాడీ పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం జిల్లాస్థాయిలోని మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు డీఐసీ పీడియాట్రీషియన్ డాక్టర్ ఇంద్రజ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వైద్య, ఆరోగ్యశాఖాధికారి మాట్లాడుతూ ఈ ఏడాది మరింత పటిష్టంగా ఈ స్ర్కీనింగ్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నివారణా ర్యాలీ

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 30న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 15 రోజులపాటు ప్రత్యేక అవగాహనా, ప్రచార ర్యాలీలను నిర్వహిస్తున్నామని చైల్డ్‌రైట్స్ అడ్వొకెసీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం రైల్వే స్టేషనుల్లో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి అనంత ప్రదీప్, ఆర్పీఎఫ్ ఎస్ఐ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతం.. వదలాల్సిందే!



- నిషేధం పక్కాగా అమలు
- కలెక్టర్ స్వీయ పర్యవేక్షణ
- 900 మందితో నిత్యం తనిఖీలు
- పట్టుబడితే వెయ్యి జరిమానా
- గుడ్డ, నార సంచుల జాడ ఎక్కడ?



రోడ్డు పక్కన దుకాణాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి (ఫైల్)

ప్లాస్టిక్ వాడకం ఆరోగ్యానికి చేటు చేస్తుందంటే వినరు.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని వాడొద్దంటే వినరు.. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న పాలిథీన్ కవర్లను నిషేధించామన్నా వినబడదు.. ఇంటి నుంచి సంచి తీసుకెళ్లడానికి నామోషీ. అందుకే కలెక్టర్, మునిసిపల్ కార్పొరేషన్ ఇంచార్జి కమిషనర్ ప్రశాంతి కొరడా ఝుళిపిస్తున్నారు. స్వయంగా దుకాణాల్లో తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫలితాలు రావాల్సిందేనంటూ అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. నార, వస్త్రం, కాగితపు సంచులనే వినియోగించాలని ప్రచారం చేస్తున్నారు. ఈ చర్యలు ఫలితాలను ఇస్తే ప్లాస్టిక్ ఫ్రీ 'తూర్పు'ను చూడొచ్చు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మనిషి మనుగడపై మనిషే గొడ్డలి వేటు వేసుకోవడమే కాలుష్యం. ఇది ఇవాళ జీవరాశి మనుగడను ప్రమాదంలో పడేసింది. జల, వాయు, ఆహార.. ఇలా అనేక కాలుష్యాలకు ప్రధాన కారణం మనమే. వీటిలో ప్లాస్టిక్ ప్రళయంగా ముంచెత్తుతోంది. ఏదో రకంగా ప్రతి రోజూ ప్లాస్టిక్‌తోనే పయనం సాగిస్తున్నాం. ముఖ్యంగా ప్లాస్టిక్ (పాలిథీన్) సంచులను విచ్చలవిడిగా వాడుతున్నారు. అన్ని మైక్రాన్లు, ఇన్ని మైక్రాన్లు అంటూ పరిమితుల మాట ఎలా ఉన్నా.. జీవరాశి మనుగడకు పెనుముప్పుగా పరిణమించాయనేది ఎన్నో సర్వేలు తేల్చిన నిజం. అయినా జనం పెడచెవిన పెడుతుండగా ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోవడం లేదు. వ్యర్థాల్లో సగానికి పైగా ఉంటున్న ప్లాస్టిక్, వాటిలోని అధిక శాతం పాలిథీన్ సంచులు, గ్లాసులు, వాటర్ బాటిళ్లు డ్రైన్లలో మురుగునీరు సాఫీగా వెళ్లకుండా అడ్డుకొని ముంపునకు కారణమవుతున్నాయి. చివరికి సముద్రంలోని తాబేళ్లు తదితర జలజీవులు ప్లాస్టిక్ వస్తువుల వల్ల మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ సంచుల్లో కూరలు, కూరగాయలు తదితర ఆహార పదార్థాలు తీసుకురావడం. ప్యాకేజింగ్‌కి వాటిని వాడడం, టిఫిన్ ప్లేట్లలో వేసుకోవడం, ప్లాస్టిక్ కోటింగ్‌తో తయారుచేసిన కృత్రిమ ఆకులు, గ్లాసులను వాడడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని వినియోగించడం వంటి వాటి వల్ల ఒక మనిషి శరీరంలోకి వారానికి సగటున 5 గ్రాముల మైక్రో ప్లాస్టిక్‌లు చేరుతున్నాయని ఓ సర్వే భయంకరమైన నిజాన్ని బయటపెట్టింది. ప్లాస్టిక్ తయారీకి ముడి చమురును మూల పదార్థంగా వాడతారు. వివిధ ఆకృతులు, రంగులు రావడానికి ఎన్నో రసాయనాలు కలుపుతారు. వాటిలో సీసం, కాడ్మియం తదితర రసాయనాల వల్ల రకరకాల క్యాన్సర్లు, హార్మోన్ అసమతుల్యత, గర్భం దాల్చడంలో ప్రతికూలతలు, చర్మ వ్యాధులు, శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం.. ఇలా రకరకాల రుగ్మతల బారిన పడుతున్నామని వివిధ సర్వేలు చెవిలో పోరు పెడుతూనే ఉన్నాయి.

● జిల్లాలో రోజుకు 50 టన్నులు..

తూర్పుగోదావరి జిల్లాలో రోజుకు సగటున 200 టన్నుల వ్యర్థాలు వేడుకలు, గృహాలు, వాణిజ్య ప్రదేశాల నుంచి ఉత్పత్తి అవుతున్నాయి. వాటిలో కనీసం 50 టన్నులపైనే ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయనేది చేదు నిజం. వీటిలో అధిక శాతం సింగిల్ యూజ్ పాలిథీన్, ఆహార పదార్థాల ప్యాకింగ్ కవర్లే ఉంటున్నాయి. జిల్లాలో 90 శాతం రాజమహేంద్రవరంలోనే వాడుతున్నారు. అయితే కింది స్థాయి సిబ్బందికి డబ్బులు వచ్చే మార్గంగా జరిమానాల తంతు మారిపోయింది. అసలు అవి విక్రయించే హోల్‌సేల్ దుకాణాల్లో ఎందుకు తనిఖీలు చేయడం లేదో అర్థంకాదు. దుకాణాల ద్వారా రోజూ కనీసం టన్ను వరకూ పాలిథీన్ కవర్లు జనాల్లోకి వెళుతున్నాయని ఓ అంచనా ఉంది. వీటన్నిటిపై కలెక్టర్ దృష్టి సారించడంతోపాటు నార, గుడ్డ, కాగితం సంచులు, గ్లాసులను విరివిగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అత్యవసరం.

● పట్టుబడితే వెయ్యి జరిమానా

జిల్లాలోని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థతోపాటు అన్ని స్థానిక సంస్థలనూ కలెక్టర్ అప్రమత్తం చేశారు. ప్రత్యేక తనిఖీ బృందాలను నియమించారు. నిబంధనలకు విరుద్ధంగా 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు వంటివి దుకాణాల్లో ఉంటే వెయ్యి రూపాయల జరిమానా విధిస్తున్నారు. అలాగే ప్రజల వద్ద ఉన్నా జరిమానాకు గురికావాల్సిందే. ప్రభుత్వ కార్యక్రమాల్లో తాగునీటికి ప్లాస్టిక్ గ్లాసులు, తినడానికి ప్లాస్టిక్ ప్లేట్లు, స్పూన్లు, బౌల్స్ సహా ప్లాస్టిక్ వాడొద్దంటూ ఇప్పటికే కలెక్టర్ ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని 95 సచివాలయాల్లో ఉన్న 900 మంది కార్యదర్శులు రోజూ తనిఖీలు చేయాలని, అవగాహన కల్పించాలని కూడా ఆదేశించారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించే ఉద్దేశంలో ఉన్నారు. అయితే కలెక్టర్‌కి సిబ్బంది చిత్తశుద్ధి, ప్రజల బాధ్యత తోడయితేనే ప్లాస్టిక్ ఫ్రీ తూర్పు సాకారమవుతుందనేది నిర్వివాదాంశం. వాస్తవానికి ఒక్క పాలిథీన్ కవరు భూమిలో కలవడానికి 10 లక్షల సంవత్సరాలు పడుతుందట. ఈలోపు అది చేసే కీడు అంతాఇంతా కాదు. పాలిథీన్ సంచులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే నిబద్ధతతో యంత్రాంగం నిషేధాన్ని అమలుచేయాలి. దీనిలో రాజకీయ నాయకులు కూడా భాగస్వామ్యం కావాలి. జరిమానాలకు పరిమితం కాకుండా విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి. జనపనార, వస్త్రంతో చేసిన సంచుల తయారీదారులను ఉదారంగా ప్రోత్సహించాలి. తక్కువ ధరకు అందుబాటులోకి విస్తృతంగా తీసుకురావాలి. స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పంపిణీ చేయడానికి చొరవ చూపాలి. బంగాళా దుంపలతో తయారు చేసిన సంచులను బ్రిటన్, జపాన్‌లో విరివిగా వాడుతున్నారు. బంగాళా దుంప నుంచి తీసే పిండి బయోపాలిమర్ ప్లాస్టిక్ లక్షణాలను కలిగి ఉంటుంది. కాబట్టి ఇది కొద్దిరోజులకే భూమిలో కలిసి పోవడంవల్ల పర్యావరణానికి హాని ఉండదు.

ప్లాస్టిక్ ఫ్రీ తూర్పు : కలెక్టర్

ప్లాస్టిక్ ఫ్రీ తూర్పుగోదావరిని చూడడమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో చర్యలకు ఉపక్రమించాం. ముందుగా రాజమహేంద్రవరంపై ఫోకస్ చేశాం. ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా మారుస్తాం. విస్తృతంగా తనిఖీలు చేయడంతోపాటు ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ వంటి రోగాలు వస్తాయని అవగాహన కూడా కల్పిస్తున్నాం. నేనే స్వయంగా తనిఖీలకు వెళుతున్నాను. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇంటి నుంచి నార, గుడ్డ, కాగితం సంచిని తీసుకెళ్తే చాలా వరకూ సమస్యకు పరిష్కారం దొరికినట్టే. ఆరోగ్య రక్షణ, పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కోరుతున్నాం.

కోరుమామిడిలో 'పొలం పిలుస్తోంది'



రైతులకు సలహాలిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాస్

నిడదవోలు, జూలై16 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులందరూ కౌలు కార్డు తప్పనిసరిగా తీసుకుని తాము పండించే పంటకు ఈ క్రాప్ చేయించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం కోరుమామిడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పండించే రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎకరానికి రూ. 570 చొప్పున్న ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించనట్టయితే ప్రకృతి వైపరీ త్యాల వల్ల పంట నష్టం వాటిల్లినప్పుడు ఎకరాకు రూ.45 వేల బీమా పొందవచ్చన్నారు. ఆగస్టు 15 లోగా రైతులంతా ఇన్సూరెన్స్ చెల్లించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి జీ. సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు సూర్య ప్రకాష్, భానుశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'కక్షిదారులకు మధ్యవర్తిత్వంతోనే న్యాయం'



న్యాయవాదుల మోటార్ సైకిళ్ల ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి అనురాధ

కొవ్వూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులకు మధ్యవర్తిత్వం ద్వారానే సత్వర న్యాయం చేకూరుతుందని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ అన్నారు. బుధవారం కొవ్వూరు కోర్టు ప్రాంగణం నుంచి న్యాయవాదుల మోటారుసైకిళ్ల ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ రాష్ట్ర న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు కొవ్వూరు కోర్టుల పరిధిలో ఈనెల 10వ తేదీ నుంచి 16 వరకు మధ్యవర్తిత్వంపై ప్రజలకు, కక్షిదారులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కొవ్వూరు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా కార్యక్రమాలను చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వర్రే నాగ మురళీ, న్యాయవాదులు టి.ప్రభాకర్, ఉప్పల కృష్ణారావు, వైప్రకాష్, ఎం.వెంకటేష్, ఎండీవీ ప్రసాద్, ఏ.సుందరి, పిల్లలమర్రి మురళీకృష్ణ, యాగంటి చలపతి ఎం.నాగమణి, వీఆర్‌వీ ప్రసాద్, పట్టణ సీఐ పీ.విశ్వం, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

'సమాన పనికి సమాన వేతనం అందించాలి'



నినాదాలు చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు

కొవ్వూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు బుధవారం సమ్మెకు దిగారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మున్సిపాల్టీలో పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు పనులు నిలుపుదల చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు రాజాన అప్పారావు, ఎం. సుందరబాబు మాట్లాడుతూ మున్సిపాల్టీలలో పనిచేస్తున్న కార్మికులకు రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వర్తింపచేయాలన్నారు. అలాగే రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అందించి, విధి నిర్వహణలో చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబసభ్యులకు కారుణ్య ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచుతూ నష్ట పరిహారాన్ని రూ. 7 లక్షలు, దహన సంస్కారాలకు రూ. 20 వేలకు, వేతనాలు రూ. 24,500 కు పెంచాలని పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవిహార్ సెంటర్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భూపతి రవీంద్ర, పూజారి వాసు, కళ్యాణి రాజేష్, కారింకి ప్రసాద్, అల్లం విజయకుమార్, శివశంకర్, వెంకటలక్ష్మి, జ్యోతి, వరలక్ష్మి, వెంకటరమణ పాల్గొన్నారు.

మహిళను గాయపర్చిన నలుగురిపై కేసు

కొవ్వూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇటుక బొంతతో మహిళను గాయపర్చిన నలుగురు మహిళలపై కేసునమోదు చేసినట్టు పట్టణ మహిళా హెచ్‌సీ లలిత తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం శ్రీరామకాలనీకి చెందిన మాసా ఏసురత్నంతో అదే కాలనీకి చెందిన కల్లు శ్రీనమ్మ, మాసా మార్త, బీర అప్పాయమ్మ, బీర సంజన ఘర్షణపడి ఇటుక బొంతతో కొట్టి గాయపర్చారు. ఏసురత్నం చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రాథమికోన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలి

బిక్కవోలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రంగాపురంలో ప్రాథమికోన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు కేంద్ర బృంద సభ్యులను కోరారు. గ్రామంలో బుధవారం నేషనల్ లెవిల్ మానిటరింగ్ సభ్యులు వినోద్, నాగరాజు పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్రం నిధులతో అమలవుతున్న పలు పథకాలను పరిశీలించారు.

ప్రజా సంక్షేమమే 'కూటమి' ధ్యేయం : ఎమ్మెల్యే

కొవ్వూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. నందమూరు, దొమ్మేరులో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ఏడాది కూటమి పాలనలో అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం నందమూరు గ్రామ టీడీపీ నాయకుల సహకారంతో పేద ప్రజలకు కూరగాయలు పంపిణీచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తుందన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, నియోజక వర్గ పరిశీలకులు గొర్రెల శ్రీధర్, సూరపనేని చిన్ని, కంటిపూడి శ్రీనివాస్, మద్దుకూరి వెంకటేశ్వరరావు, నందిగం సుధాకర్, కంటిపూడి గోపి, మారిన శివ సూర్యనారాయణ, ఎంపీటీసీ కంటిపూడి నవ్యశ్రీ, టీడీపీ మండల అధ్యక్షుడు పట్టికూటి వెంకటేశ్వరరావు, కేవీకే రంగారావు, పెనుమాక జయరాజు, వేమగిరి వెంకట్రావు, టీడీపీ నేతలు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, గారపాటి రామకృష్ణ, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, యలమర్తి శ్రీరాంప్రసాద్, కలగర సుబ్బారావు, కె.శ్రీహరి, కొప్పాక జవహర్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



నందమూరులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

● సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభం

గ్రామంలో రెండు సీసీ డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు రూ. 10 లక్షలతో చేపట్టనున్నారు.

● అంగన్వాడీల్లో మౌలిక సదుపాయాలు

సాక్ష్యం అంగన్వాడీ పథకం ద్వారా అంగన్వాడీ సెంటర్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం నందమూరులోని రెండు అంగన్వాడీ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం అందజేసిన టీవీలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొవ్వూరు ఐసీడీఎస్ సీడీపీవో కె.నాగలక్ష్మి మాట్లాడుతూ సాక్ష్యం అంగన్వాడీ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలలో మౌళిక సదుపాయాలను కల్పిస్తుందన్నారు. దానిలో భాగంగా కొవ్వూరు ప్రాజెక్టు పరిధిలో 223 అంగన్వాడీ కేంద్రాలకుగాను సొంత భవనాలు కలిగిన 112 సెంటర్లకు 36 అంగుళాల టీవీలు అందించిందన్నారు. వాటిని బుధవారం నందమూరులో ఎమ్మెల్యే అందజేశారన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, నియోజకవర్గ పరిశీలకులు గొర్రెల శ్రీధర్, సూరపనేని చిన్ని, కంటిపూడి శ్రీనివాస్, మద్దుకూరి వెంకటేశ్వరరావు, నందిగం సుధాకర్, కంటిపూడి గోపి, మారిన శివ సూర్యనారాయణ, ఎంపీటీసీ కంటిపూడి నవ్యశ్రీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ సన్నిధిలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు



తిమ్మరాజుపాలెంలో వీర్రాజుకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

నిడదవోలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపాలెంలో వేంచేసి వున్న కోటసత్తెమ్మ వారిని బుధవారం బీజేపీ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు దర్శించు కున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు దేవస్థానం సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్ స్వాగతం పలికారు. ప్రత్యేకదర్శనం అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

● శాకంబరిగా అమ్మవారు

ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం రోజున దాతలు, కోటసత్తెమ్మ తల్లి హోల్‌సేల్ కూరగాయల వర్తక సంఘం ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరిమాతగా అలంకరించనున్నారు. దీనికి భక్తులంతా హాజరుకావాలని దేవస్థానం సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ కోరారు.

చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు అవగాహన

తాళ్లపూడి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం మండల పరిధిలో గల సమాఖ్య సంఘాల నుంచి చిన్న తరహా పరిశ్రమలు స్థాపించడానికి ఆసక్తిగల మహిళలను ఎంపిక చేసే కార్యక్రమానికి ప్రతి వీవో వారిని తీసుకురావాలని ఏపీఎం ఎస్. మంగాయమ్మ అన్నారు. జూలై 18వ తారీఖున తాళ్లపూడి వెలుగు కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు చిన్న తరహా పరిశ్రమల స్థాపన కోసం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఆసక్తి ఉన్న మహిళలు కార్యక్రమానికి రావాలని, అలాగే ఎలాంటి వ్యాపారం చేసుకోవాలో అవగాహన లేకపోయినా వారి పిల్లలు లేదా వారి భర్త కూడా హాజరు కావొచ్చన్నారు. అనుభవం, నైపుణ్యం, ఆసక్తి ఉన్న వారిని మొదటి దశలో ప్రాధాన్యం ఇస్తామన్నారు. దీనికి వచ్చేవారు ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్సులతో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకుని రావాలని సూచించారు. కార్యక్రమానికి జిల్లా పరిశ్రమల కేంద్రం, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, కోయిర్ బోర్డు అధికారులు, మండలంలోని వివిధ బ్యాంకులకు చెందిన మేనేజర్లు హాజరవుతారని ఏపీఎం తెలిపారు.

రైతులకు కూటమి ప్రభుత్వం అండ

● పొక్లెయిన్ నడుపుతూ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే మద్దిపాటి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు, ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, తదితరులు

నల్లజర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులకు ఎప్పుడూ అండగానే ఉంటోందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు అన్నారు. బుధవారం ప్రకాశరావుపాలెంలో రూ. ఎనిమిది కోట్లతో పొలాల రోడ్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రకాశరావుపాలెం నుంచి చోడవరం, తెలికిచర్ల, ప్రకాశరావుపాలెం నుంచి అవపాడు, మారెళ్లమూడి రహదారులు బాగుపడనున్నాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రహదారులను పట్టించుకోకపోవడం వల్ల రైతులు తాము పండించిన పంటను తెచ్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోని వచ్చాక రైతు సమస్యలను తెలుసుకుని రహదారుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సేకరించామన్నారు. త్వరలో రైతులను నాణ్యమైన రోడ్లు వేసి వారి ఇబ్బందులను తొలగిస్తామన్నారు. ప్రకాశరావు పాలెం కేంద్ర బిందువుగా నాలుగు గ్రామాలను అనుసంధానం చేస్తూ పొలాల మార్గాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, సర్పంచ్ కొత్తూరి జాన్ విక్టర్ బాబు, పాతూరి గోపాలం, సుంకవల్లి రామకృష్ణ, బోయపాటి గంగరాజు, దాసు కనకాచార్యులు పాల్గొన్నారు.

సారా రహిత మండలంగా నిడదవోలు



సారా రహిత మండలంగా ప్రకటిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

నిడదవోలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నిడదవోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిడదవోలు మండలాన్ని సారా రహిత మండలంగా ప్రకటించడం జరిగిందని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జయరామ్ సతీష్ అన్నారు. బుధవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ మండల పరిషత్ పోలీస్ అధికార్ల సమక్షంలో నిడదవోలు మండలాన్ని సారా రహిత మండలంగా ప్రకటించారు. తహశీల్దార్ బి. నాగరాజు నాయక్, ఎంపీడీవో వీఎస్‌వీఎల్ జగన్నాథరావు, సమిశ్రగూడెం ఎస్ఐ ఎల్. బాలాజీ సుందరరావు, ఎక్సైజ్ ఎస్ఐ ఎన్ఎస్ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత రాజీవ్‌కృష్ణ పరామర్శ

తాళ్లపూడి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మలకపల్లి మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత మద్దిపాటి ప్రకాశం మాతృమూర్తి ఇటీవల మృతిచెందారు. దీనిలో భాగంగా ఆమె దశదిన కార్యక్రమం బుధవారం జరిగింది. దీనికి నియోజకవర్గ టీడీపీ నేత ఎస్. రాజీవ్‌కృష్ణ దంపతులు వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. దేవీ సీ ఫుడ్స్ ప్రొటు బ్రహ్మానందం, సొన్నటగడ్డ సుబ్బరాయ చౌదరి, ఇమ్మణ్ణి శంకరం, తదితర నాయకులు పాల్గొన్నారు.

పెరవలి పీహెచ్‌సీ తనిఖీ



రోగుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

పెరవలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. వెంకటేశ్వరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి శుభ్రత, నిర్వహణ పై వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యసేవల కోసం ఆసుపత్రికి వచ్చిన రోగుల నుంచి సంతృప్తికరమైన స్పందన లభించిందని ఆయన పేర్కొన్నారు. ఈయనతోపాటు డాక్టర్లు, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దేవరపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లికి చెందిన అల్లూరి రాజేశ్‌కు రెండు కిడ్నీలు చెడిపోవడంతో అతడి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఇదే గ్రామానికి చెందిన పలువురు ఒక్కటై సేకరించిన రూ. మూడు లక్షలను రాజేశ్‌కు బుధవారం అందజేశారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సుంకర దుర్గారావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గద్దే సుబ్రహ్మణ్యం, పంచాయతీ వార్డు సభ్యుడు కరుటూరి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగతనంపై కేసు

కొవ్వూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బైక్ దొంగతనంపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కుమారదేవం గ్రామానికి చెందిన మామిడి సతీష్ అరటి ఆకులను తన బైక్‌పై కట్టుకుని ఈ నెల 10వ తేదీన రాజమహేంద్రవరం బయలుదేరాడు. రోడ్డుకం రైలు బ్రిడ్జిపై వద్దకు వచ్చేసరికి టైరు పంక్చర్ అయ్యింది. దీంతో బైక్‌ను పక్కన పార్క్ చేసి మెకానిక్‌ను తీసుకుని రావడానికి వెళ్లాడు. తిరిగి వెళ్లే సరికి బైక్ లేదు. దీంతో ఎంత వెతికినా కనిపించకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

అభిప్రాయాలు తెలుసుకునేందుకు ...

జనసైనికులకు మరో అవకాశం

కొవ్వూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులపై జనసైనికులు ఈ నెల 19వ తేదీన నేరుగా కలిసి తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చునని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకరరావు తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ఈనెల 14వ తేదీన కొవ్వూరు జనసేన పార్టీ కార్యాలయంలో విచారణ చేపట్టడం జరిగిందన్నారు. ఏదైనా కారణాలతో ఆ రోజు కలవడం వీలుకాని జనసైనికులు, వీర మహిళలు మంగళగిరి, ఆత్మకూరు ఇప్పటం రోడ్డు లో ఎస్‌టీ క్యాపిటల్ అపార్ట్‌మెంటు ఫస్ట్ ఫ్లోరు 102 ఫ్లాట్‌లో ఈ నెల 19వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నేరుగా కలిసి తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చునన్నారు. అందరి అభిప్రాయాలు పూర్తిగా తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే మరో అవకాశం కల్పిస్తున్నట్లు శివశంకరరావు తెలిపారు.

అన్ని పార్టీలూ బీసీలను వాడుకుంటున్నాయి

● బీసీవై పార్టీ వ్యవస్థాకుడు రామచంద్ర యాదవ్ ఆవేదన



పోతవరంలో రామచంద్ర యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న బీసీ సోదరులు

నల్లజర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు బీసీలను అన్ని రాజకీయ పార్టీలూ వాడుకుని, తర్వాత పట్టించుకోవడం మానేస్తున్నాయని భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) వ్యవస్థాకుడు బోడె రామచంద్ర యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం బుట్టయిగూడెం మండలం గుబ్బల మంగమ్మ తల్లి గుడికి వెళ్తూ దారిలో కవులూరు, పోతవరంలోని బీసీ సోదరులతో కలిసి మాట్లాడారు. త్వరలో జిల్లాల వారీగా సమావేశాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బొర్రా జగన్, బొట్ట శ్రీను, పదిలం నర్సయ్య, పోలుపోయిన వెంకన్నబాబు, పోలుపోయిన రామారావు, ధూళిపాల వెంకటరత్నం, మానికల దుర్గారావు, గోతం వెంకటేశ్వరరావు, గంగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సూర్యారావు మృతి పార్టీకి తీరనిలోటు : మద్దిపాటి



సూర్యారావు పాడె మోస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

దేవరపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దుద్దుకూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కరుటూరి సూర్యారావు సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. బుధవారం ఆయన అంత్యక్రియలు జరిగాయి. ఈవిషయం తెలుసుకున్న ప్రముఖులు, రాజకీయ వేత్తలు ఆయన స్వగ్రామానికి వెళ్లి పార్థివ దేహం వద్ద పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వెళ్లి సూర్యారావు పాడెను మోశారు. సూర్యారావు మృతి పార్టీకి తీరని లోటన్నారు. అలాగే కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పలువురు రాజకీయ నేతలు వచ్చి నివాళులర్పించారు. సూర్యారావుకు ప్రముఖ పారిశ్రామికవేత్త కరుటూరి ధనంజయుడు, కరుటూరి శ్రీరామ్మూర్తి కుమారులు. వీరిని ఎమ్మెల్యేలు ముప్పిడి, మద్దిపాటి కలిసి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరితోపాటు స్థానికులు ముళ్లపూడి దొరాజీ చౌదరి, ముళ్లపూడి సత్యనారాయణ, ఆచంట శేషారావు, కంటిపూడి సుబ్బారావు, కాకర్ల రామారావు, తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి : డీఎంహెచ్‌వో

ఉండ్రాజవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కే. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఉండ్రాజవరం పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా సందర్శించి మాట్లాడుతూ ప్రజలకు ఆర్‌సీహెచ్ సేవలు, గర్భిణులకు పరీక్షలు, ఆసుపత్రిలో ప్రసవాలు, స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్, క్షయవ్యాధి పరీక్షలు, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీ. ఉమామహేశ్వరరావు, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కేడీఎల్ కుమారి, స్టాఫ్‌నర్సులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి చెత్తసేకరణ జరగాలి: ఎంపీడీవో



తాడిపర్రులో పారిశుధ్య సిబ్బందిని సత్కరిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాలని ఎంపీడీవో వీఎస్ రామారావు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నమస్తే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ చెత్త సేకరణ ఎలా జరుగుందనే విషయంపై బుధవారం ఎంపీడీవో ఆరా తీశారు. ఈ మేరకు వడ్లూరు, తాడిపర్రులో పరిశీలించారు. దీనిలో భాగంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి తడి, పొడిచెత్తను సేకరించాలన్నారు. దీన్ని శాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డుకు తరలించాలని సూచించారు. ఎంపీడీవో, ఈవోపీఆర్డీ కె. ఆంజనేయశర్మ, శానిటేషన్ కోఆర్డినేటర్ కత్తుల ప్రకాశ్ ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ విధానం గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాడిపర్రు పంచాయతీ వద్ద పారిశుధ్య కార్మికులకు పారిశుధ్య కిట్లను ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, నాయకులు పాల్గొన్నారు.

దూబచర్లలో భరించలేని దుర్వాసన

● మామిడి, నిమ్మ తొక్కు నిల్వ చేస్తున్న వ్యాపారులు ● దాన్ని పీల్చుతూ గ్రామస్థుల ఇక్కట్లు



డ్రమ్ములతో నిల్వ ఉంచిన నిమ్మ తొక్కు

నల్లజర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూబచర్లలో దుర్గంధం వెదజల్లుతోంది. దీతో గ్రామస్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వేరే ప్రాంతానికి చెందిన కొంతమంది ఇక్కడకి వచ్చి మామిడి, నిమ్మ ముక్కలను డ్రమ్ముల్లో కుళ్లబెట్టి బయటకు ఎగుమతి చేస్తున్నారు. అయితే భరించలేనంత దుర్వాసన వస్తుండడంతో గ్రామస్థులు ఆ వాసన భరించలేక వాంతులు చేసుకుంటున్నట్టు టీడీపీ జిల్లా నేత కూచిపూడి ఉదయభాస్కరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాకర్ల రామకృష్ణకు తెలపడంతో టీడీపీ నేతలు నాదెళ్ల మోహన్ మురళి, చావా రాంబాబు వెళ్లి ఆ ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. వెంటనే ఇక్కడ ఖాళీ చేయాలని నిర్వాహకులను సూచించారు. అనంతరం దీనిపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయడంతో ఆయన వచ్చి నోటీసులు అందించారు.

యోగా కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

దివాన్‌చెరువు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా పీజీ డిప్లొమా ఇన్ యోగా, యోగా సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నన్నయ ప్రాంగణంతో పాటు కానవరంలోని శ్రీరాపర్తి యోగా సంస్థలో 50 సీట్లు చొప్పున వున్నాయన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన స్త్రీ, పురుషులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 17 నుంచి వచ్చే నెల 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆగస్టు 21న కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులు రూ.6వేలు, బయటివారు రూ.10వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మూడు నెలల యోగా సర్టిఫికెట్ కోర్సును నన్నయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని,దీనికి ఆగస్టు 25న కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఫీజు విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులకు రూ. 1,500, బయటివారికి రూ.3వేలు కౌన్సెలింగ్ ప్రక్రియను విశ్వవిద్యాలయ డీవోఏ ఆచార్య పి.ఉమామహేశ్వరిదేవి నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ లేదా 73823 0 8440 నెంబర్‌ను సంప్రదించాలి.

1.62 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి...

ధవళేశ్వరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవాహం క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంటోంది. బుధవారం సాయంత్రం కాటన్ బ్యారేజీ నుంచి మొత్తం 175 గేట్లను 30 మిల్లీ మీటర్లపైకి ఎత్తి 1,62,092 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది.వ్యవసాయ అవసరాల కోసం కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 5వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,600 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7వేల క్యూసెక్కుల చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.

లక్ష్మీనారాయణ స్వామికి విశేష పూజలు

నిడదవోలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లిలో వేంచేసి వున్న లక్ష్మీనారాయణ స్వామికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి విష్ణు సహస్రనామ పారాయణం, గోవిందనామాలతో పూజలు గావించారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

టైపింగ్ షార్ట్‌హ్యాండ్ బోధించుటకు దరఖాస్తులు

కొవ్వూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఒకేషనల్ విభాగంలో టైప్ అండ్ షార్ట్ హ్యాండ్ సబ్జెక్టు బోధించుటకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సత్యనారాయణ తెలిపారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై టైప్ హయ్యర్, షార్ట్‌హ్యాండ్ హైయ్యర్ అర్హత కలిగిన వారు ఈ నెల 21వ తేదీ లోగా కళాశాల ప్రిన్సిపాల్‌కు దరఖాస్తులు అందించాలన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల కౌన్సిల్ సమావేశం

దేవరపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ దేవరపల్లి మండల శాఖ కౌన్సిల్ సమావేశం బుధవారం జరిగింది. మొత్తం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల విశ్రాంత ఉద్యోగులు సంఘం అధ్యక్షులుగా పప్పు వెంకట రామారావు, గౌరవఅధ్యక్షుడిగా కేసిరాజు సీతారామయ్య, ఉపాధ్యక్షులుగా షేక్ సయ్యద్ అలీ, సూర్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా గద్దే కృష్ణారావు, కోశాధికారిగా సీహెచ్ సుగుణలత, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనికి ఎన్నికల అధికారిగా జిల్లా అధ్యక్షుడు పల్లా సత్యనారాయణమూర్తి, పరిశీలకులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సూర్య ప్రకాశరావు వ్యవహరించారు.

టీడీపీ సీనియర్ నేత వెంకట్రావు మృతి

గోపాలపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, శతాధిక వృద్ధుడు వేలచింతలగూడెంకి చెందిన కొర్లపాటి వెంకట్రావు వయోభారంతో బుధవారం మృతిచెందాడు. ఈయన టీడీపీ ఆవిర్భావం నుంచి ఉంటూ ఎటువంటి పదవులు ఆశించకుండా పనిచేశారు. ఈయనకు ఉన్న ఇద్దరు కుమారుల్లో రెండో కుమారుడు కొర్లపాటి శ్రీరామ చంద్రమూర్తి (రాము) గతంలో వేల చింతల గూడెం సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన రాజమండ్రి పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. వెంకట్రావు మృతి చెందారన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు వచ్చి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు.